సంపుటి : 18
సంచిక : 183
Vol : 18
Issue : 183



RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, గురువారం 17 సెప్టెంబర్ 2026
Warangal, Thursday 17 September 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

WANTED
పీపుల్స్‌డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్
Cell : 9493019044
9618509859

www.epaper.peoplesdairynews.com
www.peoplesdairynews.com

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts

# కేసీఆర్ ఫాంహౌజ్ భూములపై విచారణ చేపట్టండి

- కలెక్టర్, మంత్రులకు సీఎం డెడ్‌లైన్...
- ప్రభుత్వ భూములుగా తేలితే స్వాధీనం చేసుకుంటాం
- 30 రోజుల్లో వాటి సంగతి తేలుస్తాం...
- కేసీఆర్ కుటుంబ సభ్యుల భూములపైనా ఆరా తీయండి
- అసెంబ్లీ సాక్షిగా సీఎం సంచలనం...

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫాంహౌస్ భూములపై విచారణకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. తాజాగా తెలంగాణ అసెంబ్లీలో 22ఏ భూముల అంశంపై జరిగిన చర్చ సందర్భంగా కేసీఆర్ కుటుంబ సభ్యులు, సమీప బంధువుల పేర్లపై ఉన్న భూముల వివరాలను సభ ముందు రేవంత్ రెడ్డి ఉంచారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని పెద్ద ఎత్తున ఆస్తులు కూడబెట్టారంటూ రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలకు తెరతీశారు. ఈ క్రమంలోనే ఎర్రవల్లిలో ఉన్న కేసీఆర్ ఫాంహౌస్‌కు సంబంధించిన భూములపై సమగ్రంగా విచారణ జరిపి 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

తక్షణమే రెవెన్యూ అధికారులు.. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వాలని, ఆ వెంటనే విచారణ చేపట్టాలని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసీఆర్ ఫాంహౌస్ భూముల విచారణను మంత్రులు దామోదర రాజనర్సింహ, (మిగతా 2లో...)



# మృత్యుమోత

- బెంబేలెత్తుతున్న జనం...
- నిబంధనలకు డీజే తూట్లు...
- మంగళవాయిద్యాలకు మంగళం...
- పండుగలకు, పెళ్లిళ్లకు డీజేలే క్రేజ్..
- భజనలు, కీర్తనలు పూర్తిగా కనుమరుగు
- ఆకస్మిక గుండెపోటుకు గురయ్యే చాన్స్
- వృద్ధులు, పిల్లలను చిదిమేస్తున్న అధిక శబ్దాలు
- ప్రజల ప్రాణాలు గాలిలో కలవాల్సిందేనా?
- అధికారులు దృష్టిసారించరా...?

కొండపర్తి కిరణ్
ప్రధాన ప్రతినిధి

మంగళవాయిద్యాల మధుర స్వరాలు మాయమైపో తున్న వేళ... పండుగ పూట పల్లెల్లో డీజే మోతలే మోగుతున్నాయే! భక్తి పాటల బదులు బేస్ శబ్దాలు, భజనల బదులు భీకర హోరు, సంప్రదాయాల స్థానంలో శబ్ద కాలుష్యమే రాజ్యమేలు తోంది.. వినోదమంటూ మొదలైన మోత విషాదానికి దారి తీస్తుంటే... ఆనందంగా వేసిన అడుగులు అర్ధాంతరంగా ఆగిపోతున్నాయే!

పండుగలు జరుపుకుందాం... ప్రాణాలను పణంగా పెట్టకుండా! సంప్రదాయాలను కాపాడుకుందాం... సమాజం శాంతిని కోల్పోకుండా!

మళ్లీ వినిపించాలి భక్తి గానం... మళ్లీ మోగాలి మంగళవాయిద్యం... పండుగకు ఉండాలి పరవశం... ప్రజలకు ఉండాలి ప్రశాంతత!

2వ పేజీలో..







# గణనీయంగా తగ్గిన పంటల విస్తీర్ణం

18 జిల్లాల్లో వర్షాభావమే!

- పంటలపై తీవ్ర ప్రభావం
- కొనసాగుతున్న ఎల్‌నినో ఎఫెక్ట్

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : దాదాపు పక్షం రోజుల పాటు వర్షాలు ముఖం చాటేసిన అనంతరం ఇటీవల మూడు రోజుల పాటు కొన్ని ప్రాంతాల్లో జల్లులు కురిసినప్పటికీ, రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు మాత్రం తొలగిపోలేదు. రాష్ట్రంలోని మొత్తం జిల్లాల్లో ఇంకా 18 జిల్లాల్లో లోటు వర్షపాతమే కొనసాగుతుండటం వ్యవసాయ రంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. మొత్తం 621 మండలాలకు గాను ఏకంగా 323 మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. అంతర్జాతీయంగా వాతావరణాన్ని ప్రభావితం చేస్తున్న ఎల్‌నినో ప్రభావం వల్లనే ఈ సీజన్‌లో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ తీవ్ర వర్షాభావ పరిస్థితులపై శాసనసభలో స్వల్పకాలిక చర్చ కూడా జరగనుంది.

వర్షాభావం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పంటల సాగు విస్తీర్ణంలో 6.12 శాతం మేర స్పష్టమైన తగ్గుదల కనిపించింది. ముఖ్యంగా రాష్ట్రంలో ప్రధాన ఆహార పంట అయిన వరి సాగుపై తీవ్ర ప్రభావం పడింది. గత ఏడాదితో పోల్చితే వరి సాధారణ సాగు విస్తీర్ణం కంటే సుమారు 10.58 లక్షల ఎకరాల మేర తక్కువగా సాగైంది. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో అన్ని రకాల పంటలు కలిపి మొత్తం 1,32,38,446 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఇప్పటివరకు కేవలం 1,24,27,818 ఎకరాల్లో (93.88 శాతం) మాత్రమే విత్తనాలు పడ్డాయి. అందులోనూ వరి విషయానికి వస్తే 65,95,645 ఎకరాల లక్ష్యానికి గాను కేవలం 55,36,985 ఎకరాల్లో (మిగతా 2లో...)



# హైటెక్ బస్టాండ్లకు శ్రీకారం!

- మారనున్న రూపురేఖలు
- తెలంగాణలో 13 ప్రాంతాల ఎంపిక
- షాపింగ్ నుంచి ఫుడ్ కోర్ట్ వరకు సౌకర్యాలు
- రవాణా సంస్థ కీలక ప్రణాళికలు సిద్ధం...?

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : తెలంగాణలో బస్సు ప్రయాణికులకు మరింత మెరుగైన సదుపాయాలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక ప్రణాళికను సిద్ధం చేసింది. మారుతున్న కాలానికి అనుగుణంగా బస్టాండ్ల రూపురేఖలను మార్చే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 13 ప్రాంతాల్లో ఆధునిక హంగులతో కొత్త హైటెక్ బస్ స్టేషన్లను నిర్మించేందుకు రంగం సిద్ధమైంది. కేవలం బస్సులు ఎక్కడం, దిగడం, వేచి ఉండటానికే పరిమితమయ్యేలా కాకుండా.. వ్యాపారం, వినోదం, ఆహారం, ఇతర రవాణా వ్యవస్థలతో అనుసంధానమయ్యేలా వీటిని తీర్చిదిద్దనున్నారు. ఈ ప్రాజెక్టును 'ఇంటిగ్రేటెడ్ ట్రాన్సిట్ సిస్టమ్' విధానంలో అభివృద్ధి చేయనున్నారు.

ప్రయాణికులకు మెరుగైన అనుభూతిని అందించడమే లక్ష్యంగా ఈ బస్ స్టేషన్లను ఎయిర్‌పోర్ట్ స్థాయి సదుపాయాలతో రూపొందించనున్నారు. బస్సు దిగిన తర్వాత రైల్వే లేదా ఇతర (మిగతా 2లో...)

# తిండికి, వైద్యానికి డబ్బులు లేవు..



- అకౌంట్లను అన్‌ఫ్రీజ్ చేయండి
- ఆర్థిక కష్టాలతో ఇబ్బంది పడుతున్నా...
- నాంపల్లి కోర్టులో ఐబొమ్మ రవి పిటిషన్

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : ఐబొమ్మ వెబ్‌సైట్ ద్వారా సినిమాలు పైరసీ చేస్తూ పోలీసులకు చిక్కిన ఐబొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి మరోసారి నాంపల్లి కోర్టును ఆశ్రయించాడు. తన బ్యాంకు అకౌంట్లు ఫ్రీజ్ కావడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని కోర్టుకు విన్నవించాడు. తన ఫ్యామిలీని పోషించుకోవడం కూడా చాలా కష్టం అవుతోందని నాంపల్లి కోర్టులో పిటిషన్‌లో దాఖలు చేశాడు. నిత్యావసరాలు, మెడికల్ ఖర్చులు కూడా భరించలేని పరిస్థితిలో తాను ఉన్నానని తెలిపాడు. సినిమా పైరసీ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు రవికి సంబంధించిన పలు బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు.

ఫ్రీజ్ చేసిన తన బ్యాంక్ అకౌంట్లలో సుమారు రూ.3 కోట్లు ఉన్నాయని ఇమంది రవి తన పిటిషన్‌లో పేర్కొన్నాడు. కుటుంబ అవసరాల కోసం కనీసం కొన్ని అకౌంట్లనైనా అన్‌ఫ్రీజ్ చేయాలని ఆయన నాంపల్లి కోర్టును కోరాడు. ఈ పిటిషన్‌పై నాంపల్లి 9వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు విచారణ చేపట్టనుంది. ఐబొమ్మ పైరసీ కేసు దర్యాప్తు సమయంలో రవికి చెందిన బ్యాంకు అకౌంట్లను పోలీసులు (మిగతా 2లో...)

# పాక్ కవ్వింపు...


- భారత నేవీ నౌకను ఢీకొట్టిన పాక్ నేవీ నౌక..!
- కేంద్రం సీరియస్, సమన్లు..!

పీపుల్స్‌డైరీ–న్యూఢిల్లీ : భారత్‌పై పొరుగుదేశం పాకిస్తాన్ మరోసారి కవ్వింపు చర్యలకు దిగింది. అంతర్జాతీయ జలాల్లో మన నేవీ నౌకను పాకిస్తాన్ నేవీ నౌక ఢీకొట్టింది. చోటు చేసుకున్న ఈ ఘటనపై కేంద్రం ఆగ్రహం వ్యక్తం చేసింది. తక్షణం పాక్ రాయబారికి సమన్లు జారీ చేసింది. పాకిస్తానీ నౌకాదళ యూనిట్ల ఆమోదయోగ్యం కాని వృత్తివిరుద్ధమైన ప్రవర్తన కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని విదేశీ మంత్రిత్వ శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే మన నౌకాదళ నౌకకు ఎలాంటి నష్టం జరగలేదు.

గతేడాది పాకిస్తాన్ పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ తర్వాత ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ తరుణంలోనే అంతర్జాతీయ జలాల్లో బుధవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకున్నట్లు సమాచారం. (మిగతా 2లో)

# పడిపోయిన భారత్ ర్యాంక్

- 'పాస్‌పోర్ట్ ఇండెక్స్ 2026లో 73వ స్థానం
- ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్టు ఆ దేశానిదే..




పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : ప్రపంచ దేశాల పాస్‌పోర్ట్‌ల శక్తిని అంచనా వేసే 'పాస్‌పోర్ట్ ఇండెక్స్ 2026లో భారత్ స్థానం పడిపోయింది. ఈ తాజా గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో భారత పాస్‌పోర్ట్ 73వ స్థానంలో నిలిచింది. 2025లో 66వ స్థానంలో ఉన్న భారత్.. ఈ ఏడాది ఏకంగా ఏడు స్థానాలు దిగజారింది. ఇదే సమయంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పాస్‌పోర్ట్ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదిగా మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.

ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్ట్ అత్యంత బలహీనమైనదిగా జాబితాలో చిట్టచివరన నిలిచింది. 'ఆర్టన్ క్యాపిటల్' సంస్థ ఈ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌ను రూపొందిస్తున్నది. వీసా లేకుండా (వీసా-ఫ్రీ), వీసా ఆన్ అరైవల్ (మిగతా 2లో...)

పీపుల్స్‌డైరీ
వరంగల్
గురువారం, 17 సెప్టెంబర్ 2026
సంపుటి : 18, సంచిక : 183


# మృత్యుమోత..



కొండపర్తి కిరణ్–ప్రధాన ప్రతినిధి

- నిబంధనలకు డీజే తూట్లు...
- మంగళవాయిద్యాలకు మంగళం...
- పండుగలకు, పెళ్లిళ్లకు డీజేలే క్రేజ్..
- బెంబేలెత్తుతున్న జనం...
- భజనలు, కీర్తనలు పూర్తిగా కనుమరుగు
- వృద్ధులు, పిల్లలను చిదిమేస్తున్న అధిక శబ్దాలు
- ఆకస్మిక గుండెపోటుకు గురయ్యే చాన్స్
- ప్రజల ప్రాణాలు గాలిలో కలవాల్సిందేనా?
- అధికారులు దృష్టిసారించరా...?

పండుగలు, పెళ్లిళ్లలో 'మంగళవాయిద్యాలకు' ఎప్పుడో మంగళం పాడేశారు. డీజేల రాక్షస శబ్దాలతో చెలరేగుతున్న మరణభయాలు సమాజంలో పెరిగి పోతున్నాయి. గణపతి నవరాత్రులైనా, శోభాయాత్రలైనా ఈ డీజే మోతలే విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఒకప్పుడు పండుగలు, శుభకార్యాలు అంటే భక్తిశ్రద్ధలు, భజనలు, సంప్రదాయ మంగళవాయిద్యాల శబ్దాలు మార్మోగేవి. కానీ నేడు సీన్ పూర్తిగా మారిపోయింది. "క్రేజ్" పేరిట వేల వాట్ల సామర్థ్యం ఉన్న డీజే సౌండ్ సిస్టమ్స్ రాజ్యమేలుతున్నాయి. గణేష్ నవరాత్రులు, ఇతర ఉత్సవాల వేళ ఆధ్యాత్మిక కీర్తనల స్థానంలో డీజేల హోరు వినబడుతోంది. ఊరూవాడా రాత్రింబవళ్లు మోగుతున్న ఈ సౌండ్ వాల్స్ ప్రజల గుండెలకు తీవ్ర గాయాన్ని మిగులుస్తున్నాయి.

**గుండెపోటు ప్రమాదం....**

డీజే బేస్ పెట్టే రాక్షస శబ్దాల వల్ల వచ్చే పల్సేటింగ్ తరంగాలు నాడీ వ్యవస్థను, గుండె లయను దెబ్బతీస్తున్నాయి. వృద్ధులు, చిన్నారులే కాదు యువకుల ప్రాణాలనూ చిదిమేస్తున్నాయి. అతి భారీ శబ్దాల వల్ల రక్తం గడ్డకట్టడం, గుండె కొట్టుకునే వేగం అసాధారణంగా పెరగడం వల్ల క్షణాల్లో గుండె ఆగిపోతోంది. ఇటీవల అనేక ప్రాంతాల్లో డీజే శబ్దాల మధ్య డ్యాన్స్ చేస్తూ యువకులు గుండెపోటుతో కుప్పకూలిన సంఘటనలే దీనికి ఉదాహరణ.

**శాశ్వత చెవుడు... మానసిక అలజడి**

నివాస ప్రాంతాల్లో రాత్రి వేళల్లో శబ్ద తీవ్రత 45–55 డెసిబెల్స్ మించకూడదన్నది నియమం. కానీ డీజేలు 100 నుండి 120 డెసిబెల్స్ దాటి ప్రసరిస్తుండటంతో చిన్నారుల్లో వినికిడి లోపం, వృద్ధుల్లో బిపి పెరగడం, తీవ్ర నిద్రలేమి, పక్షవాతం ప్రమాదాలు పెరుగుతున్నాయి.

**అనుమతులు ఉన్నాయంటున్న నిర్వాహకులు..**
**'పర్మిషన్ లేదు' అంటున్న అధికారులు!**

నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు, హైకోర్టు మార్గదర్శకాలకు లోబడి రాత్రి 10 గంటల తర్వాత మైక్ లేదా డీజే వినియోగం పూర్తిగా నిషేధం. శబ్ద పరిమితి పాటించని వాహనాలను సీజ్ చేయాలని, క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదేశాలు ఉన్నాయి. కానీ క్షేత్రస్థాయిలో వందల సంఖ్యలో డీజే వాహనాలు దర్జనమిస్తూ రాక్షస మోతలు మోగిస్తున్నా క్షేత్రస్థాయిలో తనిఖీలు నామమాత్రంగానే సాగుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి.

**అధికారులు స్పందిస్తారా? ప్రజల ప్రాణాలు గాలికి వదిలేస్తారా?**

అనుమతులు లేవని కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, డీజేలను సరఫరా చేసే ఆపరేటర్లపై, ఆర్గనైజర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజా సౌకర్యం, ప్రజారోగ్యం కంటే వినోదం గొప్పది కాదని, పండుగల సంప్రదాయ వైభవాన్ని కాపాడుతూ ఈ "డీజే మరణహోమానికి" అడ్డుకట్ట వేయాలని సామాజిక వేత్తలు ,ప్రజలు, నిపుణులు కోరుతున్నారు.

# కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ చేపట్టండి

(మొదటి పేజీ తరువాయి)

వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షిస్తారని సీఎం తేల్చి చెప్పారు. కేసీఆర్ ఫాంహౌస్ పరిధిలో సుమారు 340 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు సీఎం రేవంత్ రెడ్డి సభలో పేర్కొన్నారు. అయితే ఈ భూమి నిజంగా ప్రభుత్వ భూమేనని అధికారుల విచారణలో తేలిన తర్వాతే తదుపరి చర్య లు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ భూ మి ఉన్నట్లు నిర్ధారణ అయితే ఆ భూమిని స్వాధీనం చేసుకుని దళితులకు పంపిణీ చేస్తామని సీఎం ప్రకటించారు.

ఇదే సమయంలో కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన భూములపై కూడా ప్రభుత్వం దృష్టి సారించినట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. వ్యవసాయ భూముల విషయంలో అగ్రికల్చర్ సీలింగ్ యాక్ట్ నిబంధనలను ప్రస్తావిస్తూ.. కుటుంబాన్ని ఒక యూనిట్‌గా పరిగణించాల్సి ఉంటుందని వివరించారు. భూమి రకాన్ని బట్టి కుటుంబానికి నిర్ణీత పరిమితి ఉంటుందని చెప్పారు. సిద్దిపేట ప్రాంతంలో కేసీఆర్ కుటుంబానికి 67.5 ఎకరాలు.. కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు.. హరీశ్ రావు కుటుంబానికి 30 ఎకరాలు.. కల్వకుంట్ల కవిత కుటుంబానికి 37 ఎకరాలు.. జోగినిపల్లి సంతోష్‌రావు కుటుంబానికి 79 ఎకరాలు ఉన్నట్లు రేవంత్ రెడ్డి సభకు వివరించారు.

అదే సమయంలో నవీన్‌రావు పేరుతో 52 ఎకరాలు.. కొండల్‌రావు పేరుతో 48 ఎకరాలు ఉన్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. మొత్తం మీద కల్వకుంట్ల కుటుంబానికి తెలంగాణలోని 9



జిల్లాల్లోని 24 మండలాలు, 31 గ్రామాల్లో సుమారు 439 ఎకరాల భూముల వివరాలు ఉన్నాయని సీఎం సభావేదికగా వెల్లడించారు. కేసీఆర్ పేరుతో 60 ఎకరాలకు పైగా భూమి ఉందని.. కేటీఆర్ పేరుతో 49.4 ఎకరాలు.. శైలిమ పేరుతో 15 ఎకరాలు.. అలేఖ్య పేరుతో 19.3 ఎకరాలు ఉన్నట్లు రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హిమాన్షు రావు పేరుతో కూడా భూములు ఉన్నాయని సభలో తెలిపారు.

తెలంగాణ ఉద్యమ నేపథ్యాన్ని కూడా సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో ప్రస్తావించారు. సమ్మక్క, కొమురం భీమ్‌తో పాటు సాయుధ పోరాటం చేసిన కమ్యూనిస్టు ఉద్యమకారులు, ప్రజల హక్కుల కోసం పోరాడిన అనేక మంది ఆస్తులను కోల్పోయారని పేర్కొన్నారు. ఉద్యమకారుల కుటుంబాలు కూడా నష్టపోయాయని అన్నారు. కానీ కేసీఆర్ మాత్రం తెలంగాణ ఉద్యమం పేరుతో వేల కోట్ల రూపాయల ఆస్తులు, వందల ఎకరాల భూములు సంపాదించుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. వేల కోట్ల రూపాయల కాంట్రాక్టులకు సంబంధించిన అంశాలపై కూడా చర్చ జరగాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు.

# బాలల సంరక్షణ, హక్కుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

**వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ**






పీపుల్స్‌డైరీ–వరంగల్ : వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి కందుకూరి పూజ వరంగల్ ఆటోనగర్ లోని పరిశీలన గృహం, దేశాయిపేట లోని ఇండియా డిసిపిల్స్ మిషన్ చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్ మరియు సఖీ వన్ స్టాప్ సెంటర్లను సందర్శించి, రికార్డులను తనిఖీ నిర్వహించారు.

ఈ సందర్భంగా పరిశీలన గృహం.... ఇండియన్ డిసిపిల్స్ మిషన్, (చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్)లోని బాలలతో న్యాయమూర్తి ఆత్మీయంగా మాట్లాడి, వారి విద్య, ఆరోగ్యం, వసతి, భోజనం, భద్రత ఇతర అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. బాలలకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి, వారి సమస్యలను సానుభూతితో విని, అవసరమైన న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

సఖీ వన్ స్టాప్ సెంటర్ను సందర్శించిన న్యాయమూర్తి, అక్కడ అందిస్తున్న సేవలు, బాధిత మహిళలకు కల్పిస్తున్న న్యాయ సహాయం, కౌన్సెలింగ్, వైద్య సహాయం, పోలీస్ సహకారం మరియు పునరావాస సేవలు తదితర అంశాలను పరిశీలించారు. సంబంధిత రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి, బాధితులకు సకాలంలో అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. బాలలు మరియు మహిళల హక్కుల పరిరక్షణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని న్యాయమూర్తి తెలిపారు.

# ఈసారి మొత్తం 13 రోజులు దసరా సెలవులు..

**విద్యార్థులకు గుడ్‌న్యూస్..**


**తేదీలు ప్రకటించిన ప్రభుత్వం**

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : తెలంగాణలో దసరా సెలవులపై విద్యాశాఖ బిగ్ అప్‌డేట్ ఇచ్చింది. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్–1 (ఎస్‌ఏ–1) పరీక్షల షెడ్యూల్‌తో పాటు దసరా సెలవుల తేదీలను కూడా తాజాగా ప్రకటించింది. అక్టోబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఎస్‌ఏ–1 పరీక్షలు నిర్వహించనుండగా.. ఆ తర్వాత అక్టోబర్ 10వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పాఠశాలలకు దసరా సెలవులు ఉండనున్నాయి. అంటే ఈసారి దసరా పండగకు వరుసగా 13 రోజుల పాటు విద్యార్థులకు సెలవులు రానున్నాయి.

తెలంగాణలోని పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు అక్టోబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్–1 పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణలో భాగంగా తరగతుల వారీగా వేర్వేరు సమయాలను విద్యాశాఖ కేటాయించింది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు.. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. 6, 8వ తరగతుల విద్యార్థులకు ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. 7వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష ఉంటుంది.

9వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. తరగతుల వారీగా ఏ రోజు ఏ సబ్జెక్టుకు పరీక్ష నిర్వహించనున్నారనే పూర్తి టైమ్‌టేబుల్‌ను విద్యార్థులు తమ పాఠశాలల ద్వారా తెలుసుకోవాలని విద్యాశాఖ సూచించింది.

ఎస్‌ఏ–1 పరీక్షలు పూర్తి అయిన వెంటనే విద్యార్థులకు దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి. అక్టోబర్ 10వ తేదీ నుంచి అక్టోబర్ 22వ తేదీ వరకు రాష్ట్రంలోని పాఠశాలలకు సెలవులు ఉండనున్నాయి. అక్టోబర్ 10వ తేదీ నుంచి 22వ తేదీ వరకు లెక్కిస్తే మొత్తం 13 క్యాలెండర్ రోజులు సెలవులు రానున్నాయి. ఈసారి బతుకమ్మ, దసరా పండుగలు కూడా ఇదే సెలవుల సమయంలో రావడంతో విద్యార్థులకు వరుసగా సెలవులు లభించనున్నాయి.




**పండుగల తేదీలు ఇలా..!**

అక్టోబర్ 10: దసరా సెలవులు ప్రారంభం

అక్టోబర్ 11: బతుకమ్మ ప్రారంభం

అక్టోబర్ 19: సద్దుల బతుకమ్మ

అక్టోబర్ 20: విజయదశమి

అక్టోబర్ 22: దసరా సెలవులకు చివరి రోజు

అక్టోబర్ 23: పాఠశాలలు తిరిగి ప్రారంభం

దసరా సెలవులకు ముందు ఎస్‌ఏ–1 పరీక్షలు ఉండటంతో విద్యార్థులు ముందుగానే ప్రిపరేషన్ పూర్తి చేసుకోవాలని విద్యాశాఖ సూచించింది. పరీక్షల అనంతరం అక్టోబర్ 10వ తేదీ నుంచి సెలవులు ప్రారంభం కానున్నందున విద్యార్థులు తమ పాఠశాలల్లో అందించే పూర్తి టైమ్‌టేబుల్‌ను పరిశీలించి పరీక్షలకు సిద్ధం కావాల్సి ఉంటుంది. అక్టోబర్ 23వ తేదీ నుంచి పాఠశాలలు సాధారణంగా పునఃప్రారంభం కానున్నాయి. దీంతో తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ షెడ్యూల్ కీలకంగా మారింది.

# తగ్గిన పంటల విస్తీర్ణం

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమే రైతులు నాట్లు వేయగలిగారు. ఇప్పటికే వానాకాలం సీజన్ ముగింపు దశకు చేరుకోవడం, మిర్చి మినహా మిగిలిన పంటలను వేసే అవకాశం లేకపోవడంతో సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం లేకుండా పోయింది.

నెలవారీగా లోటు వర్షపాతం గణాంకాలు

ప్రస్తుత సీజన్ ఆరంభం నుంచే వర్షాలు దోబూచులాడుతున్నాయి. జూన్ నెలలో 11.74 శాతం, జులైలో 1.36 శాతం మేర వర్షపాతం లోటు నమోదు కాగా, ఆగస్టు నెలలో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఆగస్టులో ఏకంగా 37.67 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ప్రస్తుత నెలలో కూడా ఇప్పటివరకు 29.39 శాతం తక్కువ వర్షపాతం రికార్డైంది. సీజన్ మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్రవ్యాప్తంగా సగటున 18.82 శాతం లోటు కొనసాగుతోంది.

జిల్లాల వారీగా పరిశీలిస్తే జోగులాంబ గద్వాల జిల్లాలో అత్యధికంగా 45.42 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత హనుమకొండ జిల్లాలో 41.91 శాతం, వనపర్తిలో 40.70 శాతం, నాగర్‌కర్నూల్‌లో 39.07 శాతం, నారాయణపేట జిల్లాలో 37.42 శాతం వర్షపాతం లోటు రికార్డైంది. వీటితో పాటు వరంగల్, ఆదిలాబాద్, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, మేడ్చల్, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, హైదరాబాద్ జిల్లాల్లోనూ వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయి.

**పంటలకు పొంచి ఉన్న ఎండగండం**

వర్షాలు లేకపోవడంతో చాలా జిల్లాల్లో పొలాల్లోని పైర్లు ఎండ తీవ్రతకు వాడిపోతున్నాయి. వర్షపాత లోటుకు తోడు ప్రధాన ప్రాజెక్టులు, చెరువులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు అడుగంటడం పరిస్థితిని మరింత జటిలం చేస్తోంది. భూగర్భ జలాలు భారీగా పడిపోవడంతో వ్యవసాయ బోర్లు కూడా ఎండిపోయి నీరు పోయడం ఆపేశాయి. ప్రస్తుతం వరి పంట ఎదుగుదల దశలో ఉండగా, పత్తి పంట కీలకమైన పూత, కాత దశలో ఉంది. ఈ క్లిష్ట సమయంలో నీరు అందకపోతే పంటలు పూర్తిగా ఎండిపోయి పెట్టుబడులు కూడా దక్కవని రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఈ నెలాఖరు వరకైనా విస్తారంగా వర్షాలు కురిస్తేనే చేతికొచ్చిన పంటలు దక్కుతాయని, లేదంటే అన్నదాతలు తీవ్ర నష్టాలపాలయ్యే ప్రమాదం ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే దీనిపై సమగ్ర నివేదికను రూపొందించిన వ్యవసాయశాఖ ప్రభుత్వానికి సమర్పించింది.

# హైటెక్ బస్టాండ్లకు శ్రీకారం...!

(మొదటి పేజీ తరువాయి)

రవాణా సాధనాలను సులభంగా చేరుకునేలా బహుళ రవాణా అనుసంధాన సదుపాయాలు కల్పించనున్నారు. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో చేపడుతున్న ఈ బృహత్తర ప్రాజెక్టుకు ప్రభుత్వం, రవాణా శాఖల నుంచి ఇప్పటికే అధికారిక అనుమతులు లభించినట్లు సమాచారం.

ప్రయాణికులు బస్సు కోసం ఎదురుచూసే సమయంలో ఆహ్లాదంగా గడిపేందుకు కూడా ఏర్పాట్లు చేయనున్నారు. ఫుడ్ కోర్టులు, గేమింగ్ సదుపాయాలు, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్ల వంటి వసతులను ఏర్పాటు చేయాలనే ప్రణాళిక ఉంది. దీంతో కొత్త బస్టాండ్లు కేవలం రవాణా కేంద్రాలుగా కాకుండా షాపింగ్, ఆహారం, వినోదానికి కూడా వేదికలుగా మారనున్నాయి. ఈ నిర్మాణాలు పూర్తయితే ప్రయాణికులకు ఒకే చోట అనేక అవసరాలు తీర్చుకునే అవకాశం లభించనుంది.

ఈ మోడల్ బస్ స్టేషన్లను నాగర్‌కర్నూల్, రేగొండ, హుజూర్‌నగర్, కోదాడ, కొడంగల్, కోస్గి, మద్దూరు, కేసముద్రం, హుస్నాబాద్, ములుగు, మధిర, నల్గొండ, కొత్తగూడెం ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.. మొత్తం 13 ప్రాంతాల్లో ఈ నిర్మాణాలు చేపట్టనున్నారు. త్వరలోనే మోడల్ బస్ స్టేషన్ల నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

ఈ ప్రాజెక్టుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా రవాణా ప్రాంగణాలు ఆధునిక రూపాన్ని సంతరించుకోవడంతో పాటు ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన అనుభవం అందే అవకాశం ఉంది. ప్రజా రవాణాను కొత్త తరహాలో తీర్చిదిద్దే ప్రయత్నంలో భాగంగా ౹+ూ=జ తీసుకున్న ఈ నిర్ణయం బస్టాండ్ల వినియోగ విధానంలో మార్పు తీసుకురానుంది.

# పడిపోయిన భారత్ ర్యాంక్

(మొదటి పేజీ తరువాయి)

సౌకర్యాలున్న దేశాల సంఖ్య ఆధారంగా 'మొబిలిటీ స్కోర్' (ఎంఎస్) కేటాయిస్తారు. ఈ స్కోర్ ఎంత ఎక్కువగా ఉంటే ఆ పాస్‌పోర్ట్ అంత శక్తిమంతమైనదని అర్థం. మొత్తం 199 దేశాల పాస్‌పోర్టులను ఈ ర్యాంకింగ్ కోసం విశ్లేషించారు. ప్రస్తుతం భారత్ మొబిలిటీ స్కోర్ 69గా ఉంది. ఈ స్కోర్‌తో భారత్.. జింబాబ్వే, ఉగాండా, ఉజ్బెకిస్థాన్, సావో టోమ్ అండ్ ప్రిన్సిపీ, వియత్నాం వంటి దేశాలతో కలిసి 73వ స్థానాన్ని పంచుకుంటోంది.

భారత పాస్‌పోర్ట్ ఉన్నవారు 25 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించవచ్చు. మరో 39 దేశాల్లో వీసా–ఆన్–అరైవల్ సౌకర్యం ఉంది. అయితే 129 దేశాలకు వెళ్లాలంటే ముందస్తుగా వీసా తప్పనిసరి. గత ఏడాదితో పోలిస్తే వీసా ఆన్ అరైవల్ దేశాల సంఖ్య తగ్గడంతో మొబిలిటీ స్కోర్ 73 నుంచి 69 కి పడిపోయింది. ఇదే ర్యాంకు పతనానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఈ జాబితాలో యూఏఈ పాస్‌పోర్ట్ 181 మొబిలిటీ స్కోర్‌తో ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదిగా మొదటి స్థానంలో నిలిచింది.

# తిండికి, వైద్యానికి డబ్బులు లేవు..

(మొదటి పేజీ తరువాయి)



ఫ్రీజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం ఆ ఖాతాల్లో డబ్బు అందుబాటులో లేకపోవడంతో కుటుంబ నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రవి కోర్టు దృష్టికి తీసుకెళ్లాడు. తన ఫ్యామిలీని పోషించుకోవడం, రోజువారీ ఖర్చులతో పాటు మెడికల్ ఖర్చుల కోసం కూడా డబ్బు అవసరం అవుతోందని పిటిషన్‌లో ఐబొమ్మ రవి పేర్కొన్నాడు. అందుకే అన్ని అకౌంట్లు లేకపోతే కొన్ని అకౌంట్లనైనా అన్‌ఫ్రీజ్ చేయాలని కోరాడు.

# పాక్ కవ్వింపు...

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర అరేబియా సముద్రంలో భారత యుద్ధనౌక సాధారణ నిఘా విధుల్లో ఉండగా.. పాకిస్థాన్ నౌకాదళ నౌక ఒకటి వేగంగా వచ్చి దానిని ఢీకొట్టింది. అయితే, దీనివల్ల మన నౌకకు ఎటువంటి నష్టం వాటిల్లలేదని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. అయితే దీని వెనుక ఉన్న కారణాలేంటన్నది బయటకు రాలేదు.

అయినా ఇలా భారత నౌకను పాకిస్తాన్ నేవీ నౌక ఢీకొనడం కవ్వింపు చర్యల కిందకే వస్తుందని భావిస్తున్న కేంద్రం.. ఆ మేరకు వివరణ ఇవ్వాలని ఇస్లామాబాద్ రాయబారికి సమన్లు పంపింది. దీనిపై పాకిస్తాన్ స్పందన ఆధారంగా కేంద్రం తదుపరి చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే సింధు జలాల విషయంలో భారత్ తీసుకున్న నిర్ణయంతో విలవిల్లాడుతున్న పాకిస్తాన్.. ఏదో విధంగా కవ్వింపు చర్యలకు దిగాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ జలాల్లో చోటు చేసుకున్న ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# ఓజోన్ పొరను కాపాడుకుందాం..పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- సుజాత విద్యానికేతన్‌లో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం




**హసన్‌పర్తి, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** 66వ డివిజన్ కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారామ్ కర్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఓజోన్ పొర పరిరక్షణ ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. భూమిపై సమస్త జీవరాశుల మనుగడకు ఓజోన్ పొర కీలక రక్షణ కవచంగా నిలుస్తుందన్నారు. వాతావరణ కాలుష్యం, క్లోరోఫ్లోరో కార్బన్ల వినియోగం తదితర కారణాలతో ఓజోన్ పొర దెబ్బతింటే సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల ప్రభావం పెరిగి జీవరాశులకు ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండిషనర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు తదితరాల వల్ల పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, విరివిగా మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా వాతావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. 1987 సెప్టెంబర్ 16న ఓజోన్ పొర పరిరక్షణకు సంబంధించి మాంట్రియల్ ప్రోటోకాల్‌పై ప్రపంచ దేశాలు ఒప్పందం చేసుకున్న విషయాన్ని ఆయన వివరించారు. ఈ ఏడాది ఓజోన్ దినోత్సవం సందర్భంగా స్థిరమైన శీతలీకరణ, పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల ఎన్‌జీసీ యూనిట్ ఆధ్వర్యంలో గత 30 ఏళ్లుగా వన మహోత్సవం, మొక్కల పంపిణీ, మట్టి వినాయక విగ్రహాల పంపిణీ, కాలుష్య రహిత దీపావళి, హోలీ, జల సంరక్షణ, ప్లాస్టిక్ నిషేధంపై పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు చేసిన సేవలకు పాఠశాలకు ఆరు పర్యావరణ మిత్ర జాతీయ అవార్డులు లభించాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో ఓజోన్ పొర పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గూడూరు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు జూపాక నాగరాజు, ఏ. వెంకట్, పి. వెంకటేశ్వర్లు, ఈ. ప్రవీణ్, రాధాకుమారి, సబిహా, అరుణ, సుచిత్ర, సంధ్య, సీహెచ్. సంధ్య, ప్రవళిక, రాణి, దేవిక, దివ్య, స్వాతి, గీత తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో మరిన్ని భూపోరాటాలు

- సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి
- తెలంగాణ సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశాలలో చేర్చాలి
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- సిపిఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వారోత్సవాల ర్యాలీ, సభ




**భూపాలపల్లి : సెప్టెంబర్ 16 పీపుల్స్ డైరీ..** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో మరిన్ని భూపోరాటాలు నిర్వహిస్తామని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు,బుధవారం భూపాలపల్లి సిపిఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వారోత్సవాల ర్యాలీ, సభ నిర్వహించారు. తొలుత కొమ-రయ్య భవన్ నుండి బస్టాండ్ వద్దగల అమరవీరుల స్తూపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద జరిగిన సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అధ్యక్షత వహించగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దున్నేవాడికే భూమి నినాదంతో,లక్షల ఎకరాల భూ పంపిణీ చేశామని,నేడు ఆపోరటస్ఫూర్తితో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేస్తు భూ పోరాటాలు కొనసాగిస్తున్నామని అన్నారు. పేదల కోసం మరిన్ని భూ పోరాటాలు కొనసాగిస్తామని వారు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను బిజెపి వక్రీకరిస్తుందని శ్రీనివాసరావు విమర్శించారు. రజాకార్లు, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన చారిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన అసలైన చారిత్రాత్మక పోరాటమని కొనియాడారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నేతృత్వంలో ప్రజలు సాహసోపేతమైన పోరాటం చేశారని, ఆనాటి పోరాట స్ఫూర్తిని నేటి తరాలు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. నాటి సాయుధ రైతాంగ పోరాటంలో నాలుగు వేల కమ్యూనిస్టు అమరుల త్యాగాలతో ఎర్ర బారిన నేల తెలంగాణ అని అన్నారు. నిజాం నిరంకుశ పాలనను కూలదోసింది కమ్యునిస్టులేనని, పటేల్ సైన్యం కాదని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగానే నిజాం నిరంకుశ పాలన రద్దయ్యిందని,పటేల్ సైనిక చర్య వల్ల కాదని ఆయన గుర్తు చేశారు. ఆ పోరాటంలో 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచి, 3 వేయి గ్రామాలను విముక్తి చేసింది కమ్యూనిస్టులేనని చెప్పారు. ఆనాడు పటేల్ చీకటి ఒప్పంద ఫలితమే నిజాం రాజుకు గవర్నర్ పదవి దక్కిందని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట అమర వీరులను స్మరించుకుందామని, వారి ఆశయ సాధనకు ప్రతిజ్ఞ చేద్దామని పిలుపునిచ్చారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని, అమరుల జీవిత చరిత్రలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యాంశాలుగా చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ శ్రేణులు, కార్మికులు, రైతులు, ప్రజా సంఘాల నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని, సాయుధ పోరాట వీరులకు జోహార్లు అర్పిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, జిల్లా నాయకులు మోటపలుకుల రమేష్, సుధాకర్ రెడ్డి,సోతుకు ప్రవీణ్, ఫైండ్ల శాంతి, కొరిమి సుగుణ, 24వ వార్డు కౌన్సిలర్ వేముల జ్యోతి, నేరెళ్ల జోసెఫ్, శ్రీకాంత్, అన్నారపు రాజేందర్, ఆసిఫ్ పాషా,తాళ్ల పోశం, రవికుమార్, గోలి లావణ్య, గంప శ్రావణి, గడ్డం స్వరూప, మట్టి నాగమణి,పెద్దమామల సంధ్య, సుభద్ర,తదితరులు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


# రోడ్డుపై అక్రమ కట్టడాల కలకలం..రాకపోకల దారినే ఆక్రమించారా..?

- ప్రజల రాకపోకల దారినే ఆక్రమించారా..?
- గోడలు.. మెట్లు.. రోడ్డుపై నిర్మాణాలతో ఇబ్బందులు
- అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలి
- మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామికి దుర్గా కాలనీవాసుల వినతి




**జమ్మికుంట, సెప్టెంబర్ 16పీపుల్స్ డైరీ :** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు దుర్గా కాలనీలో రహదారి ఆక్రమణలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ స్కూల్ మెయిన్ రోడ్డు నుంచి హాస్టల్ వరకు ఉన్న మున్సిపల్ సీసీ రోడ్డుపై కొందరు నిర్మాణాలు చేపట్టినట్లు పేర్కొంటూ, వాటిని పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను తొలగించాలని కోరుతూ దుర్గా కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామికి వినతిపత్రం సమర్పించారు. విద్యుత్ స్కూల్ మె-యిన్ రోడ్డు నుంచి హాస్టల్ వరకు ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే సీసీ రోడ్డుపై గోడలు, మెట్లు, ఇతర నిర్మాణాలు చేపట్టడంతో రహదారి వినియోగానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కాలనీవాసులు తెలిపారు. ప్రజల రాకపోకలకు ఉపయోగపడాల్సిన మున్సిపల్ రహదారి ఆక్రమణలకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. రోడ్డును ఆక్రమించి నిర్మించినట్లు పేర్కొంటున్న గోడలు, మెట్లు, కటకాలు తదితర నిర్మాణాలను మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయి-ంలో పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. రహదారి హద్దులను గుర్తించి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు ఉన్నట్లు తేలితే వాటిని తొలగించాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారిని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు ప్రజల కోసం.. ఆక్రమణలకు కాదు అని పేర్కొంటూ అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని కాలనీవాసులు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి రహదారిని పరిశీలించి, వాస్తవ పరిస్థితులను నిర్ధారించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రహదారిపై నిర్మాణాల కారణంగా భవిష్యత్తులో మరింత ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, సమస్యను ఇప్పుడే పరిష్కరించాలని స్థానికులు కోరారు. ప్రజల రాకపోకలకు ఆటంకంగా ఉన్న నిర్మాణాలను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని తొలగించి రహదారిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాధ రాంబాబు, మీడివెల్లి సంపత్, మారేల్ల రవి, రాధ నరేష్, చొప్పరి సదానందం, చొప్పరి రాము, ఒద్ది శ్రీకాంత్, రాధ భారత్, ముకుంద సాయి వంశీ, మూడేడ్ల గణేష్, పకిడె మణికంఠ, పెంతల సురేందర్, బోల్లం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పొన్నం సత్తయ్య గౌడ్ 16వ వర్ధంతి



**వీణవంక సెప్టెంబర్ 16 ( పీపుల్స్ డైరీ) :** మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య గౌడ్ 16వ వర్ధంతి సందర్భంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పొన్నం సత్తయ్య గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయనను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని, సంఘీభావాన్ని తెలియజేశారు. పొన్నం సత్తయ్య గౌడ్ ఆశయాలు, విలువలను గుర్తుచేసుకుంటూ ఆయన జ్ఞాపకాలను స్మరించుకున్నారు. సామాజికంగా, రాజకీయంగా ప్రజలతో మమేకమై పనిచేసిన పొన్నం సత్తయ్య గౌడ్ సేవలను నాయకులు గుర్తుచేసుకున్నారు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండటం, ప్రజల సమస్యల పట్ల స్పందించే తత్వం ఆయనలో ఉండేదని పేర్కొన్నారు. ఆయన చూపిన సేవా మార్గాన్ని భవిష్యత్ తరాలు స్ఫూర్తిగా తీసుకోవాలని వారు అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబానికి పొన్నం సత్తయ్య గౌడ్ అందించిన విలువలు, మార్గదర్శకత్వం ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని నాయకులు పేర్కొన్నారు. తండ్రి జ్ఞాపకాలను కొనసాగిస్తూ ప్రజా సేవలో ముందుకు సాగుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నాయకులు తమ సంఘీభావాన్ని తెలిపారు. వర్ధంతి కార్యక్రమం సందర్భంగా నాయకులు కొద్దిసేపు మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండీ సాహెబ్ హుస్సేన్, జిల్లా ఉపాధ్యక్షులు మోలుగురి సదయ్య, గూడపు సారంగపాణి, సలీం పాషా, గూడెపు ఓదెలు, దొడ్డ శ్రీకాంత్, చదువు జైపాల్ రెడ్డి, కట్కూరి ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్వీయ హాజరు పట్టిక జెడ్ పి హెచ్ ఎస్ గుండారెడ్డిపల్లి.




**కోహెడ సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** కోహెడ మండలంలోని గుండారెడ్డిపల్లి జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో విద్యార్థులు తమ అటెండెన్స్ తామే వేసుకుంటూ మురిసిపోతున్నారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని గుండారెడ్డిపల్లి పాఠశాల విద్యార్థుల హాజరు పెంచేందుకు ఉపాధ్యాయుడు చేసిన వినూత్న ప్రయోగము సత్ఫలితాలు ఇవ్వడంతో ప్రధానోపాధ్యాయుడు సతీష్ చంద్ర తో పాటు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ఆకట్టుకునేందుకు హిందీ ఉపాధ్యాయుడు ఆడెపు నరేందర్ నోటీస్ బోర్డుపై అగ్గిపెట్టెతో కూడిన సెల్ఫ్ అటెండెన్స్ బోర్డును ఏర్పాటు చేశారు విద్యార్థి పాఠశాలకు రాగానే అగ్గిపెట్టిన తెరిచి తన ఫోటో కనపడేలా ఉంచి హాజరు వేసుకుంటాడు బడి సమయం ముగియగానే అగ్గిపెట్టెను మూసివేసి ఇంటికి వెళ్తారని,ఒకవేళ విద్యార్థి రాకపోతే మర్నాడు ఆబ్సెంట్ కనబడుతుందని, దీనితో బడికి రాలేదని తెలిసిపోతుందని విద్యార్థులు రోజు పాఠశాలకు వస్తున్నారని, దీనిని గ్రామ సర్పంచ్ పిల్లి బాబు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ కడతాల సరిత విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను అభినందించారు.

# మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్

ఎన్ఎస్ఎస్ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో..



**జమ్మికుంట సెప్టెంబర్ 16పీపుల్స్ డైరీ :** జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జాతీయ సేవా పథకము ( ఎన్ ఎస్ ఎస్ ) కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపల్ మరియు లెక్చరర్స్, విద్యార్థిని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ మానవాళి మనగడకు మొక్కలే ఆధారం కాబట్టి అమ్మ జన్మనిస్తే చెట్టు పునర్జన్మణిస్తుంది ప్రస్తుత వాతావరణ కాలుష్య పరిస్థితి దృశ్య ఈ కళాశాలలో చదువుతున్నటువంటి విద్యార్థిని విద్యార్థులు మీ మీ నివాస ప్రాంతాలలో ఖాళీ ప్రదేశాలలో అందరూ మొక్కలు నాటడం ద్వారా మీ ఆరోగ్యంతో పాటు చుట్టుపక్కల వారి ఆరోగ్యాన్ని కూడా కాపాడిన వారు అవుతారు కాబట్టి అందరు కూడా మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించేలాగా కృషి చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్,ఓదెలు కుమార్, గణేష్,రాజేందర్,రవీందర్ మరియు ఎన్ఎస్ఎస్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గొల్లగూడెంలో స్మార్ట్ కార్డుల పంపిణీ



**సైదాపూర్ సెప్టెంబరు 16 ( పీపుల్స్ డైరీ) :** గొల్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బత్తుల మౌనిక, ఉప సర్పంచ్ దుస్స కుమార్ కార్యక్రమంలో పాల్గొని గ్రామ ప్రజలకు స్మార్ట్ కార్డులను అందజేశారు. ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమం: ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రుద్రారపు లలిత, బత్తుల.వనిత హసీనా, అందే రజిత, మిట్టపెల్లి వెంకయ్య జిపిఓ రాజేందర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ అంగన్వాడీ టీచర్ జుబేదా ,రుద్రరాపు రవి,మిట్టపెల్లి శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. స్మార్ట్ కార్డుల పంపిణీ ద్వారా గ్రామ ప్రజలకు సంబంధిత సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొని స్మార్ట్ కార్డులను స్వీకరించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

# అంగన్వాడీ కేంద్రం వద్ద పారిశుద్ధ్య పనులు



**సింగరేణి, (కారేపల్లి) సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ):** సింగరేణి మండలం స్టేషన్ చీమలపాడు గ్రామ పరిధిలోని అంగన్వాడీ కేంద్రం వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, చెట్ల వ్యర్థాలను బుధవారం తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. అంగన్వాడీ కేంద్రానికి నిత్యం వచ్చే చిన్నారులు, బాలింతలకు చెత్తాచెదారం కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అంగన్వాడీ టీచర్ రజిత సమస్యను గ్రామ ఉపసర్పంచ్ ధరావత్ లాలు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామ పరిసరాల్లోని చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, చెట్ల వ్యర్థాలను తొలగించి పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. "గ్రామ అభివృద్ధి మనందరి బాధ్యత" అనే ఉద్దేశంతో ప్రజలకు ఉపయోగపడే పారిశుద్ధ్య కార్యక్రమాలను కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా చిన్నారులు, బాలింతలు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంలో అంగన్వాడీ కేంద్రానికి వచ్చేలా పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధరావత్ కోటేష్, మాలోతు మాన్సింగ్, దండు ప్రసాద్, మేడేపల్లి శ్యామ్, బానోతు వీరు, బానోతు మల్చూర్, బాదావత్ వీరన్న, భానోతు చిన్ని, గుగులోతు జ్యోతి, దండు సునీత, మాలోతు బద్రి, ఎల్లవుల కవిత తదితరులు పాల్గొన్నారు.

## టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో గురూ సన్మాన మహోత్సవం



**చిగురుమామిడి,సెప్టెంబర్16(పీపుల్స్ డైరీ):** టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కరీంనగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో చిన్న ములకనూరు మోడల్ స్కూల్ లో గురూ సన్మాన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్ కె. వీరస్వామి, ట్రైనర్ వర్మ, అసిస్టెంట్ మేనేజర్లు శ్రీకాంత్ విజయ్ పాల్గొన్నారు. సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ హర్జిత్ కౌర్, గ్రామ సర్పంచ్ సాంబార్ భారతమ్మ కొమరయ్య ,ఉప సర్పంచ్‌లు పైడిపెల్లి వెంకటేశ్ , పాఠశాల సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తూ, సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, పాఠశాలలోని 30 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల సేవలను గౌరవించడం సమాజం మొత్తం బాధ్యత అని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు.

## తెలంగాణలో స్కూళ్లకు దసరా సెలవులు ఎప్పట్నించి అంటే...!

**అక్టోబర్ 1 నుంచి 9 వరకు సమ్మేటివ్-1 పరీక్షలు-అక్టోబర్ 10 నుంచి 22 వరకు దసరా సెలవులు**

తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులకు విద్యార్థులకు ముఖ్యమైన అప్‌డేట్. రాష్ట్రంలో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సంబంధించి సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షల షెడ్యూల్‌తో పాటు దసరా సెలవులను విద్యాశాఖ వెల్లడించింది. దీని ప్రకారం, అక్టోబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఎస్ఏ-1 పరీక్షలు జరగనున్నాయి. అనంతరం అక్టోబర్ 10 నుంచి 22వ తేదీ వరకు పాఠశాలలకు దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. పరీక్షల నిర్వహణలో సౌలభ్యం కోసం తరగతుల వారీగా వేర్వేరు సమయాలను కేటాయించారు.

**పరీక్షల సమయాల వివరాలు ఇలా ఉన్నాయి:** 1 నుంచి 5వ తరగతి వరకు: విద్యార్థులకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు 6, 8వ తరగతులకు: ఉదయం 9:15 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు 7వ తరగతికి మధ్యాహ్నం 1:15 నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు 9వ తరగతికి మధ్యాహ్నం 1:15 నుంచి సాయంత్రం 4:15 గంటల వరకు 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 9:15 నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా, తరగతుల వారీగా ఆయా సబ్జెక్టుల పరీక్ష తేదీలతో కూడిన పూర్తి స్థాయి కూడిన టైమ్ టేబుల్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం విద్యార్థులు, ఉపాధ్యాయులు పరీక్షలకు సన్నద్ధం కావాలని విద్యాశాఖ సూచించింది.

## భార్య ముక్కు కొరికేసిన భర్త... మంచిర్యాలలో దారుణం



తెలంగాణలోని మంచిర్యాల జిల్లాలో ఓ కిరాతక ఘటన వెలు గుచూసింది. భార్యా భర్తల మధ్య తలెత్తిన వివాదంలో ఆగ్రహానికి లోనైన భర్తే, భార్య ముక్కు కొరికి తీవ్రంగా గాయ పరిచాడు. ఈ అమానుష ఘటన బుధవారం కొటపల్లి మండలంలో చోటుచేసుకుంది. మణిచందర్, మమత దంపతులకు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరగగా, వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబ కలహాల కారణంగా మమత తన పుట్టింట్లోనే నివసిస్తోంది. ఈ క్రమంలో భార్యను తిరిగి తన వెంట తీసుకెళ్లేందుకు మణిచందర్ నేడు అత్తవారింటికి వెళ్లాడు. అయితే మమతను పంపేందుకు ఆమె తండ్రి నిరాకరించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కోపోద్రిక్తుడైన మణిచందర్ తన మామపై కర్రతో దాడి చేశాడు. భర్తను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మమతపై కూడా అతను విచక్షణారహితంగా దాడి చేసి, ఆమె ముక్కును కొరికేశాడు. ఈ ఘటనలో బాధితురాలి ముక్కు భాగం తీవ్రంగా దెబ్బతింది. స్థానికులు వెంటనే స్పందించి బాధితురాలికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఆమెను వరంగల్‌లోని మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఓటుకు నోటు కేసు.. రేవంత్ రెడ్డి, సండ్ర పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ

**పిటిషన్లపై విచారణ జరిపిన సీజేఐ ధర్మాసనం**



ఈ అంశంపై విచారణ జరిపే పరిధి ఏసీబీకి లేదన్న పిటిషనర్ల తరపు లాయర్లు నాటి నిబంధనల ప్రకారం ఈ అంశాన్ని ఎన్నికల ప్రక్రియగానే చూడాలని వాదన తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఈరోజు విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు. 2015లో కేసు నమోదైన నాటికి అమల్లో ఉన్న చట్టాలను ప్రస్తావిస్తూ... నాటి నిబంధనల ప్రకారం లంచం ఇవ్వడం/తీసుకోవడం అనే ప్రక్రియను ఎన్నికల కేసుగా చూడాలి తప్ప, అవినీతి నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించలేమని న్యాయవాదులు వాదించారు. గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొదటి నుంచి చేపట్టింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.

## విద్యార్థుల సంఖ్య మరింత పెరిగేలా ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలి

- **ప్రయోగాత్మక విద్యకు ప్రాధాన్యం**
- **కొంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రీ-ప్రైమరీ పాఠశాలలను తనిఖీ చేసిన కలెక్టర్ రాహుల్‌శర్మ**



**భూపాలపల్లి సెప్టెంబర్ 16 పీపుల్స్ డైరీ..** భూపాలపల్లి మండలం కొంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రీ-ప్రైమరీ పాఠశాలలను జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్య, మౌలిక వసతులను పరిశీలించారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వాహనాలు ఏర్పాటు చేసుకుని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యా సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థుల ప్రవేశాలను దాదాపు 50 శాతం పెంచడంపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగేలా ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు.

**ప్రయోగాత్మక విద్యకు ప్రాధాన్యం**

పాఠశాలలోని సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్ వసతులను సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**విద్యార్థుల లక్ష్యాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్**

పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడారు. వారి చదువు, భవిష్యత్తు లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పలువురు విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్, వైద్యులు, ఇంజనీర్లు కావాలనే తమ ఆకాంక్షలను వెల్లడించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.

**చిన్నారులకు ఆహ్లాదకర వాతావరణంలో విద్య**

ప్రీ-ప్రైమరీ పాఠశాలలో చిన్నారులకు అందిస్తున్న అభ్యాసన పద్ధతులు, తరగతి గదులు, మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులను కలెక్టర్ పరిశీలించారు. చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ మరుగుదొడ్లను కూడా పరిశీలించారు.

**మొక్క నాటిన కలెక్టర్**

పాఠశాల ఆవరణలో కలెక్టర్ మొక్క నాటి, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పాఠశాలకు కిచెన్ షెడ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు రుచికరంగా, నాణ్యంగా భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ లలిత, సర్పంచ్ శ్రీకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణపల్లిలో భూభారతిపై ప్రజలకు అవగాహన సదస్సు



**వీణవంక సెప్టెంబర్ 17( పీపుల్స్ డైరీ) :** మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో భూభారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తహసీల్దార్ ముద్దసాని రమేష్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హుజురాబాద్ ఆర్డీవో జాల కుమారి, ముఖ్యఅతిథిగా హాజరై భూభారతి చట్టానికి సంబంధించిన అంశాలపై గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా అధికారులు భూములకు సంబంధించిన రికార్డుల నిర్వహణ, భూ సమస్యల పరిష్కారం, పట్టాదారు పాస్‌బుక్‌లు, భూ హక్కులు, రికార్డుల్లో మార్పులు, వారసత్వం, భూ వివాదాల పరిష్కారానికి సంబంధించిన ప్రక్రియలపై ప్రజలకు అవగాహన కల్పించారు. భూ రికార్డుల్లో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే వాటిని గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే భూములకు సంబంధించిన పత్రాలను భద్రంగా ఉంచుకోవాలని, భూ లావాదేవీల సమయంలో పూర్తి వివరాలను పరిశీలించి ముందుకు వెళ్లాలని అధికారులు సూచిం చారు. భూభారతి ద్వారా అందుబాటులోకి వచ్చే సేవలు, వాటిని పొందే విధానం గురించి గ్రా మస్తులకు వివరించారు. ప్రజలు తమ భూములకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, సంబంధిత పత్రాలతో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించుకోవాలని అధికారులు సూచించారు. గ్రామస్థులు అడిగిన పలు భూ సమస్యలు, సందేహాలను అధికారులు వివరంగా విని వాటిపై తగిన సూచనలు చేశారు. ఈ అవగాహన సదస్సులో రెవెన్యూ అధికారులు, కేడి కిషన్ రావు డిఐ రత్నం ఎంపీడీవో ప్రభాకర్ జి పి ఓ లు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## డీజేలకు అనుమతి లేదు..నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- **రేగొండ ఎస్సై సుధాకర్..**
- **రేగొండ మండల డీజే నిర్వహకుల బైండవర్ ..**




**రేగొండ సెప్టెంబర్ 16 పీపుల్స్ డైరీ...** గణేశ్ ఉత్సవాల్లో డీజేలు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రేగొండ ఎస్సై సుధాకర్ హెచ్చరించారు. బుధవారం రేగొండ మండల కేంద్రంలోనీ డీజే యజమానులను మండల తహసిల్దార్ శ్వేత రావు బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సైమాట్లాడుతూ... గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. మండపాల వద్ద ఫైర్ సేఫ్టీ, విద్యుత్ వైర్ల భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని తెలిపారు. డీజేలకు ఎలాంటి అనుమతి లేదని, నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేసి అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి గణేష్ మండపం వద్ద ఇద్దరు నిర్వాహకులు 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని కూడా ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు, నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

## కొత్తపల్లి గోరి పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ

- **పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి:**
- **డీఎస్పీ సంపత్ రావు**



**రేగొండ సెప్టెంబర్ 16 పీపుల్స్ డైరీ..** కొత్తపల్లి గోరి పోలీస్ స్టేషన్‌లో బుధవారం వార్షిక తనిఖీలో భాగంగా భూపాలపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ . సంపత్ రావు, పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గణపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ రావు, కొత్తపల్లి గోరి ఎస్ఐ శ్రీ ఎస్. త్రిలోక్ నాథ్ రెడ్డి, డీఎస్పీ కి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, కేసు డైరీలు, క్రైమ్ రికార్డులు, సీసీటీఎన్ఎస్ నమోదు వివరాలు, పెండింగ్ కేసులు, వారెంట్లు, బీట్ బుక్స్, స్టేషన్ రికార్డులు, మాల్ఖానా తదితర రికార్డులను డీఎస్పీ, పరిశీలించారు. అదేవిధంగా సిబ్బందికి డిపార్ట్‌మెంట్ ద్వారా అందజేసిన కిట్లు, వాటి నిర్వహణ, వినియోగ పరిస్థితిని కూడా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కారం, నేరాల నియంత్రణ, ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విధి నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని డీఎస్పీ సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంతా అబద్ధం.. రేవంత్ రెడ్డి ఆరోపణలకు కవిత కౌంటర్

- **ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని సవాల్**
- **తనతో పాటు పలువురి ఆస్తులపైనా సీబీఐ విచారణకు డిమాండ్**
- **అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై ఎదురుదాడి**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు. కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన 'గుంటనక్క'తో పాటు కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. 'గుంపు మేస్త్రీ - గుంటనక్క' ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.

పీపుల్స్ డైరీ
వరంగల్
గురువారం, 17 సెప్టెంబరు 2026
సంపుటి : 18, సంచిక : 183


# శ్రీరామా...! నీ ఆలయ నిర్మాణం ఎప్పుడు స్వామి...?

- దశాబ్దాల కల నెరవేరేనా..?
- పాలకులు పట్టించుకోవాలి
- చిట్యాలకు ఏమైనా వాస్తు దోషం ఉందా..?





**చిట్యాల, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ):** ఉమ్మడి వరంగల్ జిల్లాకే తలమానికంగా ఉన్న పాత తాలూకాగా పేరు ప్రఖ్యాతులుగాంచిన (ప్రస్తుత జయశంకర్ భూపాలపల్లి జిల్లా) చిట్యాల మండల కేంద్రంలో శ్రీరాముడి గుడి నిర్మాణం ఎప్పుడు జరుగుతుంది అని ప్రజలు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల కల అయిన శ్రీరాముడి గుడి నిర్మాణం కలగానే మిగిలి పోతుందా అని భక్తులు భావోద్వేగంతో తెలుపుతున్నారు. అసలు చిట్యాల గ్రామానికి ఏమైనా వాస్తు దోషం ఉందా..? లేకపోతే ఎప్పుడో శ్రీరాముడి గుడి నిర్మాణం పూర్తి కావలసి ఉండగా సంవత్సరాలు గడిచినా కూడా పూర్తి కాకపోవడానికి గ్రామానికి ఏమైనా దోషం ఉందా అని భక్తులు ప్రజలు బాధపడుతున్నారు. ఆలయ నిర్మాణ చరిత్రలో పవిత్రమైన భగవంతుని ఆశీస్సులతో చిట్యాల మండల కేంద్రంలో శ్రీరాముడి ఆలయ నిర్మాణ శంకుస్థాపన లాంటి పనులు కోసం ఎప్పుడు మొదలు కానుందని యావత్ చిట్యాల మండల కేంద్రముతో పాటు మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు. శ్రీరాముడి ఆలయ నిర్మాణం చిట్యాలలో అవుతుందా కాదా..? అనే వేలాది భావనలు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చిట్యాలలో శ్రీరాముడి ఆలయ నిర్మాణం కోసం గ్రామ సర్పంచ్ ముందుండి దాతల గ్రామ పెద్దల ప్రభుత్వ పాలకుల అధికారుల సహకారంతో ఆలయ నిర్మాణానికి పూనుకుంటే ప్రతి ఒక్కరూ సహకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రజలు భక్తులు పేర్కొంటున్నారు. విరాళాల సేకరణ పాలకుల ప్రభుత్వ సహకారంతో చిట్యాలలో శ్రీరాముడి గుడి నిర్మాణం చేయడం గ్రామాన్ని ఆధ్యాత్మిక క్షేత్రంగా మార్చడం పెద్ద కష్టమైన పని కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. శ్రీరాముడి ఆశీస్సులతో గ్రామస్తుల సహకారంతో ఆయన గుడి నిర్మాణం సులువుగానే అవుతుందని భక్తులు ప్రజలు తెలుపుతున్నారు.

శ్రీరాముడి ఆలయ నిర్మాణం కై గ్రామంలోని ప్రతి ఒక్కరు కంకణ బద్ధులై ముందుకు సాగాలని సాగుదామని ప్రజలు పేర్కొంటున్నారు. దశాబ్దాలుగా వినిపిస్తున్న శ్రీరాముని గుడి నిర్మాణం ఎందుకు అవ్వట్లేదు..చిట్యాలకు వాస్తు దోషం ఏమైనా ఉందా..? అనే అనుమానాలు ప్రజల్లో చర్చకు దారి తీస్తున్నాయి. దాతలు ప్రజలు ప్రముఖులు నాయకులు ముందుండి నడిపిస్తే గాని రాముని గుడి నిర్మాణం పూర్తవుతుంది. భారతదేశ చరిత్రలో దేవాలయాలు అతి ముఖ్యమైన అంశాలలో ఒకటి అవి ప్రార్థన స్థలం మాత్రమే కావు మన సంస్కృతి మరియు సాంప్రదాయానికి నిలయం. హిందూ పురాణాల ప్రకారం దేవుడు సర్వాంతర్యామి అయినప్పటికీ ఆలయాల్లో తీర్థ స్థలాల్లో త్వరగా అనుగ్రహిస్తాడని విశ్వాసం భక్తులకు ఉంటుంది అందుకే దేవాలయ సందర్శనం తీర్థయాత్రలు చేయడం హిందూ సంస్కృతిలో భాగమైతే దేవాలయాల్లో పుణ్యక్షేత్రాలు సందర్శించడానికి శాస్త్రీయ కోణం కూడా ఉంది. పూర్వీకులు పీఠాధిపతులు మఠాధిపతులు దేవాలయాలు నిర్మించేటప్పుడు ఆ స్థలానికి ఆ స్థలానికి ఉన్న సానుకూల శక్తులను కూడా పరిశీలిస్తారు. ఎక్కడైతే సానుకూల శక్తుల ప్రభావం అధికంగా ఉంటుందో ఆ ప్రదేశంలోనే దేవాలయం నిర్మిస్తారు దేవాలయాలు నిర్మించి మూల విరాట్టుని ప్రతిష్టించే ముందు పీఠం కింద వేదమంత్రాలు లిఖించిన రాగి రేకును ఉంచి దానిపై మూల విరాట్టు ను ప్రతిష్టించడం ఆనవాయితీగా ఉంటుంది.

ఆ రాగి రేకుకు భూమి లోపల శక్తి తరంగాలను ఆకర్షించి పరిసరాలలో విడుదల చేసే అద్భుతమైన శక్తి ఉంటుంది. దైవ దర్శనం కోసం గుడికి వెళ్ళినప్పుడు ఆయా సానుకూల శక్తి తరంగాలు భక్తులపై ప్రసరించడం వలన భక్తుల్లో పాజిటివ్ ఎనర్జీ వలన భక్తులకు మానసిక ప్రశాంతత కలుగుతుంది. అందుకే దైవదర్శనాల కోసం ఆలయాన్ని సందర్శించిన తర్వాత మనసుకు ప్రశాంతంగా ఉంటుంది ఆలయానికి వెళ్ళినప్పుడు ప్రదక్షిణలు చేయడం సహజం ఆలయంలో ఆలయంలో ప్రదక్షిణలు చేసేటప్పుడు గర్భాలయంలో ప్రతిష్ఠించిన విగ్రహం కింద నిక్షిప్తం చేసిన మంత్ర పూర్వక రాగి రేకు విడుదల చేసే శక్తి తరంగాలు మనపై ప్రసరించడం వలన శారీరక మానసిక ఆరోగ్యాలు చేకూరుతాయని విశ్వాసం. అందుకే ప్రతి గ్రామంలో ఆలయం ఉండాలి. ఆలయం ఉండడం వలన ఆధ్యాత్మిక మరియు శాస్త్రీయ లాభాలు ఉంటాయి. భక్తులు ఆలయాలకు వెళ్లడం అక్కడ కొలువుదీరిన దేవతామూర్తులను పూజించడం అనాది హిందూ సాంప్రదాయంగా వస్తుంది. ఒక రకంగా చెప్పాలంటే ప్రజల హృదయాల్లో ఆధ్యాత్మిక భావనలను నింపడానికి దేవాలయాలు దోహదం చేస్తాయి అనేది నిజం. అయితే దైవం అంతట ఉన్నప్పుడు ఆ దైవాన్ని ఎక్కడైనా ఏ రూపంలోనైనా పూజించే వెసులుబాటు ఉన్నప్పుడు ఆలయాలకు వెళ్ళవలసిన అవసరం ఏముంటుందనే ప్రశ్న కూడా భక్తుల్లో ప్రజల్లో ఉత్పన్న మవుతుంది. దీనికి ప్రశాంతత కోసం ఉత్తమమైన ఆలోచనల కోసం అనేది సామాన్యంగా వినిపించే జవాబు. ఆలయాలను ఎందుకు దర్శించాలి అనే ప్రశ్నకు శాస్త్రీయమైన కారణాలు కూడా ప్రాచీన గ్రంధాలు వివరించాయి. శబ్ద స్పర్శ రూప రస గ్రంధాల ద్వారా మనిషి జ్ఞానాన్ని పొందుతాడు. చెవులు చర్మం కళ్ళు నాలుక ముక్కు అనే ఐదు ఇంద్రియాల ద్వారా జరుగుతుంది. అందుకే వాటిని జ్ఞానేంద్రియాలు అంటారు. ఆలయాల్లో వాతావరణం వలన అవన్నీ ఉద్దీపన చెందుతాయి అక్కడ ఉన్న పాజిటివ్ ఎనర్జీని మనలోకి నింపుతాయి గర్భగుడిలో ప్రవేశించినప్పుడు గంట మోగిస్తాం దాని ద్వారా మనం మెదడులోని కుడి ఎడమ భాగాలు ఏకత్వాన్ని పొందే విధంగా శబ్దాన్ని వెలువరించేలా ఆ గంటలను తయారు చేస్తారు. గంట మోగించినప్పుడు నిషితమైన స్థిరమైన శబ్దం వస్తుంది ఆ శబ్దం కనీసం ఏడు సెకండ్ల పాటు ప్రతిధ్వనిస్తుంది ఇది మన శరీరంలోని ఏడు నాడులను జాగృతం చేయడానికి ఈ ప్రతిధ్వని వ్యవధి సరిపోతుంది అంటారు శాస్త్రజ్ఞులు. ఫలితంగా మన మెదడులోని ప్రతికూల ఆలోచనలు అన్ని తొలగిపోతాయి అనేది శాస్త్రీయంగా చెప్పబడింది. దేవాలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక శాస్త్రీయ లాభాలు ఉన్నప్పటికీ భక్తులు ప్రజలు ఆలయ నిర్మాణాల విషయంలో తీవ్రమైన జాప్యం చేస్తూ ఆలయ నిర్మాణాల్లో వెనుకబడుతున్నారు. ఇదే క్రమంలో భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రం పరిధిలోని చింతలపల్లి ప్రాంతంలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం ఉంది. అదేవిధంగా వెంకట్రావుపల్లి సి ప్రాంతంలో మరో ఆంజనేయ స్వామి ఆలయం ఉంది. ఈ రెండు ఆలయాలను ఆయా ప్రాంతాల ప్రజలు గత కొన్ని సంవత్సరాల క్రితం విరాళాల చందాల రూపంలో ఆర్థిక వనరులను సమకూర్చుకొని స్వచ్ఛందంగా ప్రజలందరి భక్తుల సహకారంతో నిర్మించుకున్నారు. మండల కేంద్రానికి మెయిన్ సమీప ప్రాంతాలైన గ్రామపంచాయతీ సమీప బీసీ కాలనీ మరియు రాంనగర్ కాలనీ ప్రాంతాల వారికి ఎటువంటి ఆలయం లేకపోవడం వలన ఆయా ప్రాంతాల ప్రజలు భక్తులు తీవ్ర నిరాశ నిస్పృహలకు గురవుతున్నారు. గత కొన్ని సంవత్సరాల క్రితం మండల కేంద్రంలో రామాలయ నిర్మాణం చేయడానికి భక్తులు ప్రజలు దాతలు భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామ పెద్దల సహకారంతో ఆలయ నిర్మాణ కమిటీ ఏర్పాటు చేసి ఆ సమయంలోనే మండల కేంద్రంలోని రామాలయం గుడి నిర్మాణం కోసం ప్రత్యేకించబడిన స్థలంలోనే రామాలయ నిర్మాణం కోసం భూమి పూజ కూడా నిర్వహించారు. అప్పుడు వచ్చిన విరాళాలతో ఆలయ నిర్మాణం కోసం సామాగ్రి కూడా తీసుకొచ్చారు. కానీ కొన్ని అనివార్య కారణాల వలన ఆ సమయంలో ఆలయ నిర్మాణం కాలేదు దాంతో ప్రజలు భక్తులు దాతలు అసంతృప్తి కి గురయ్యారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడానికి బీసీ కాలనీ రామ్ నగర్ కాలనీ భక్తులు తాత్కాలిక ఉత్సవ విగ్రహాలతో మాత్రమే పూజా కార్యక్రమాలు నిర్వహించి దానితోనే సరిపెట్టుకుంటున్నారు. హిందూ ఆధ్యాత్మిక కార్యక్రమాలలో వచ్చే పండుగలలో భాగంగా ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి వినాయక చవితి దుర్గామాత ఉత్సవాలు తదితర పండుగల సందర్భంగా ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి తాత్కాలికంగా పూజలు నిర్వహిస్తున్నారు తప్ప శాశ్వతంగా ఆయా దేవుళ్లకు ఆలయ నిర్మాణాలు చేసుకొని నిత్య పూజలు చేసిన వ్యవస్థ లేదు. బీసీ కాలనీ రామ్ నగర్ కాలనీకి మాత్రమే ఎటువంటి దేవాలయం లేకపోవడంతో భక్తులు ప్రజలు తీవ్ర అసహనానికి గురవుతున్నారు.

రామాలయ నిర్మాణం కోసం కమిటీలు వేస్తున్నారు విరాళాలు వసూలు చేస్తున్నారు తప్ప మనస్ఫూర్తిగా దైవ సంకల్పంతో ప్రయత్నం చేయడంలో ప్రజలు భక్తులు దాతలు విఫలమవుతున్నారని ఆరోపణలు సర్వత్ర వినిపిస్తున్నాయి. రామాలయ నిర్మాణం కోసం బీసీ కాలనీ రామ్ నగర్ కాలనీ భక్తులు ప్రజలు తమకు తోచినంత సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నారు. ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యతలు గ్రామంలోని ప్రముఖులు యువత దాతలు మనస్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగితే రామాలయ ఆలయ నిర్మాణం ఎందుకు కాదు..? అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఆలయ నిర్మాణాన్ని ఎవరు అడ్డుకుంటున్నారు..?

ఆలయ నిర్మాణం కోసం దాతలు విరాళాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా ఎవరు నిర్లక్ష్యం చేస్తున్నారు..? అనే తదితర ప్రశ్నలు భక్తుల్లో ప్రజల్లో ఉత్పన్నమవుతున్నాయి. ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యతలు గ్రామంలోని ప్రముఖులు యువత దాతలు తీసుకుంటే ఆలయ నిర్మాణం సాగుతుంది ఆలయ నిర్మాణం జరుగుతుంది అని భక్తులు ప్రగాఢ విశ్వాసంతో ఉన్నారు.

మండల కేంద్రంలో రామాలయ నిర్మాణం కోసం జిల్లా మండల గ్రామ ప్రజా ప్రతినిధుల నాయకులు గ్రామంలో ఆర్థికంగా స్థిరపడిన వారి సహాయ సహకారాలతో ముందుకు వెళితే ఆలయ నిర్మాణం కష్టతరం కాదు మండల కేంద్రంలో రామాలయ గుడి నిర్మాణం కచ్చితంగా అయి తీరుతుంది అని భక్తులు ప్రజలు నమ్ముతున్నారు. నీ గుడి నిర్మాణం ఎప్పుడయ్యా అని భక్తులు ప్రజలు ఆ శ్రీరామచంద్రమూర్తిని వేడుకుంటున్నారు. రామాలయ నిర్మాణం తొందరగా జరపాలని దానికి ప్రజల సహకారం ఉంటుందని గ్రామస్తులు తెలుపుతున్నారు. వెంటనే అన్ని వర్గాలతో ఆలయ నిర్మాణ నూతన కమిటీ ఏర్పాటు చేసి దాతల సహకారంతో భక్తుల సహకారంతో అదే విధంగా ప్రభుత్వ సహకారంతో రామాలయ నిర్మాణానికి పూనుకోవాలని భక్తులు ప్రజలు కోరుతున్నారు. అసలు గ్రామంలో దేవాలయం ఎందుకు నిర్మించాలి అంటే దానికి వివరనాత్మకమైన హిందూ ధార్మిక విధానంలో అదేవిధంగా శాస్త్రీయంగా కూడా ఆలోచించినప్పుడు దేవాలయం అంటే ప్రార్థన స్థలం లేదా పండుగలు వేడుక వంటి మతపరమైన లేదా ఆధ్యాత్మిక కార్యకలాపాల కోసం ప్రత్యేకించబడిన భవనం అని అర్థం. దేవాలయాలను సందర్శించినప్పుడు అక్కడ జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో భక్తులు పాల్గొంటారు దాని ద్వారా ఒకరికొకరు పరిచయమై బంధాలను ఏర్పాటు చేసుకొని ఆపదల సమయంలో ఒకరికొకరు ఆదుకునే విధానాన్ని కూడా పెంపొందించుకుంటారు.

ఇన్ని ఆధ్యాత్మిక శాస్త్రీయ లాభాలతో ముడిపడి ఉన్న కారణంగా చిట్యాల మండల కేంద్రంలో పిఏసిఎస్ గ్రౌండ్ ప్రక్కనే గల రామాలయ ఆలయ నిర్మాణంను ప్రత్యేకంగా కేటాయించిన స్థలంలో భక్తులు ప్రజలు దాతలు ప్రముఖులు పెద్ద మనుషులు యువత ఉద్యోగులు విరాళాలు చందాల రూపంలో ఆర్థిక వనరులను సమకూర్చుకొని చిట్యాల మండల కేంద్రంలో రామాలయ నిర్మాణం చేయాల్సిందేనని భక్తులు అపార నమ్మకంతో ముక్తకంఠంతో ఆ శ్రీరామచంద్రమూర్తి ని వేడుకుంటున్నారు. అతి తొందరలోనే రామాలయ నిర్మాణం జరగాలని ఆ శ్రీరామచంద్రమూర్తిని వేడుకుందాం...

# సెమీకండక్టర్ రంగానికి రెడ్ కార్పెట్.. సింగపూర్ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ

- **తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్న సింగపూర్ బృందం**
- **రాష్ట్రంలో అత్యాధునికి మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయన్న ముఖ్యమంత్రి**
- **సెమీకండక్టర్ పరిశ్రమకు పూర్తి స్థాయిలో సహకారాన్ని అందిస్తామని హామీ**



భవిష్యత్తు ప్రపంచ సాంకేతిక రంగాన్ని, కృత్రిమ మేధస్సు విప్లవాన్ని శాసించబోతున్న సెమీకండక్టర్ రంగానికి తెలంగాణ ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరుస్తోంది. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే వ్యూహంలో భాగంగా, రాష్ట్రంలో సెమీకండక్టర్ పరికరాలు, చిప్ డిజైనింగ్, తయారీ పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ బృహత్తర ప్రణాళికలో భాగంగా, తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు సింగపూర్ బృందం ప్రకటించింది. శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డితో సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ శాశ్వత కార్యదర్శి (ఇంధన, వాణిజ్య విభాగం) అగస్టిన్ లీ నేతృత్వంలోని బృందం భేటీ అయి విస్తృతంగా చర్చలు జరిపింది. రాష్ట్రంలో అత్యాధునిక మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ పరిశ్రమలకు పూర్తి స్థాయిలో అనుమతులు, సబ్సిడీలు, సహకారాన్ని అందిస్తామని ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను కేవలం పర్యాటక రంగంలోనే కాకుండా అంతర్జాతీయ నాలెడ్జ్ హబ్‌గా మారుస్తున్నామని స్పష్టం చేశారు. నెట్-జీరో కార్బన్ విధానంతో నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ, తొలిదశ మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, నైట్ ఎకానమీ ప్రణాళికలను సింగపూర్ బృందానికి వివరించారు. ఇప్పటికే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు తమ ఆఫ్-షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు సూత్రప్రాయంగా అంగీకరించాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాబోయే డిసెంబరు నెలలో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు సింగపూర్ బృందాన్ని సీఎం అధికారికంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు కూడా పాల్గొన్నారు.

# నగరంలోకి దూరప్రాంత బస్సులకు 'నో' ఎంట్రీ

**. హైదరాబాద్ శివార్లలో 4 టెర్మినళ్లు!-హైదరాబాద్ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వ ప్రణాళిక**




హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీ, కాలుష్యాన్ని తగ్గించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఓ బృహత్ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. నగరంలోకి ప్రవేశించే దూరప్రాంత బస్సులను శివార్లకే పరిమితం చేసేలా నాలుగు దిక్కులా భారీ బస్ టెర్మినళ్లను నిర్మించాలని నిర్ణయించినట్టు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ నిర్ణయంతో నగర ప్రజా రవాణా వ్యవస్థలో సమూల మార్పులు రానున్నాయి. మంత్రి తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం, శంషాబాద్, ఎల్బీ నగర్, ఘట్‌కేసర్‌లలో ఆధునిక టెర్మినళ్లను ఏర్పాటు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులు, అలాగే ఇతర జిల్లాల నుంచి వచ్చే సర్వీసులు ఇకపై నగరంలోకి ప్రవేశించకుండా ఈ టెర్మినళ్ల వద్దే తమ ప్రయాణాన్ని ముగిస్తాయి. అక్కడి నుంచి ప్రయాణికులను నగరంలోని వివిధ ప్రాంతాలకు చేరవేసేందుకు పటిష్టమైన 'లాస్ట్-మైల్ కనెక్టివిటీ' ఏర్పాటు చేస్తారు. ఈ టెర్మినళ్ల నుంచి ప్రయాణికులు ఇబ్బంది పడకుండా వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు టీజీఎస్ఆర్టీసీ సిటీ బస్సులు, మెట్రో రైలు, ఎంఎంటీఎస్ సేవలను అనుసంధానించనున్నట్టు మంత్రి వివరించారు. ప్రభుత్వ బస్సులతో పాటు ప్రైవేట్ బస్సులను కూడా ఈ కొత్త నిబంధనల పరిధిలోకి తీసుకురానున్నారు. నిర్దేశిత టెర్మినళ్ల నుంచే అవి కూడా నడపాల్సి ఉంటుంది. టెర్మినళ్లను వినియోగించుకున్నందుకు ప్రైవేట్ ఆపరేటర్ల నుంచి రుసుము వసూలు చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ టెర్మినళ్ల నిర్మాణానికి అవసరమైన భూమిని కూడా గుర్తించామని, గాజులరామారంలో 100 ఎకరాలు, శంషాబాద్ వద్ద 150 ఎకరాల స్థలాన్ని పరిశీలిస్తున్నామని పొన్నం తెలిపారు. ఈ ప్రణాళికలో భాగంగా రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు 2,200 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను కూడా ప్రవేశపెట్టనున్నట్టు మంత్రి చెప్పారు. ఈ టెర్మినల్ ఆధారిత వ్యవస్థతో నగరంలోని ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీహరికి డీఆర్‌డీవోలో కీలక పదవి

**బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ ప్రోగ్రామ్‌లో కీలక పాత్ర పోషించిన శ్రీహరి**




రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో)కు చెందిన ప్రతిష్ఠాత్మక ప్రయోగశాల 'రీసెర్చ్ సెంటర్ ఇమారత్' (ఆర్‌సీఐ) నూతన డైరెక్టర్‌గా ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ పి. శ్రీహరి బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని ఈ ప్రఖ్యాత సంస్థలో మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. క్షిపణి వ్యవస్థలు, ఏవియానిక్స్ రంగాల్లో ఆర్‌సీఐ దేశంలోనే అత్యంత కీలకమైన పరిశోధనా కేంద్రంగా గుర్తింపు పొందింది. 1992లో డీఆర్‌డీవోలో శాస్త్రవేత్తగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన డాక్టర్ శ్రీహరి, మూడు దశాబ్దాలకు పైగా సంస్థలో వివిధ ఉన్నత స్థాయి బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుత నియామకానికి ముందు ఆయన భారత బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ (బీఎండీ) కార్యక్రమానికి ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. దేశ క్షిపణి రక్షణ వ్యవస్థలో భాగంగా ఇంటర్‌సెప్టార్ క్షిపణుల కోసం 'డైవర్ట్ అండ్ ఆటిట్యూడ్ కంట్రోల్ సిస్టమ్' అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించారు. 2019లో భారత్ అంతరిక్షంలోని ఉపగ్రహాన్ని విజయవంతంగా కూల్చివేసి చరిత్ర సృష్టించిన 'మిషన్ శక్తి' (యాంటీ శాటిలైట్ టెస్ట్) కోర్ టీమ్‌లో శ్రీహరి కీలక సభ్యుడిగా ఉన్నారు. అలాగే, భారత వాయుసేన కోసం ఇజ్రాయెల్‌తో కలిసి సంయుక్తంగా చేపట్టిన ఎంఆర్‌శామ్ క్షిపణి ప్రాజెక్టుకు డైరెక్టర్‌గా కూడా ఆయన సేవలందించారు. నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి బీటెక్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేసిన డాక్టర్ శ్రీహరి.. రక్షణ రంగంలో చేసిన విశేష కృషికి గాను 'అగ్ని అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్', 'సైంటిస్ట్ ఆఫ్ ది ఇయర్' వంటి పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకున్నారు.

# సింగరేణిలో దారుణం: వేధింపులు తాళలేక ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

**ఓవర్‌మ్యాన్ లైంగిక వేధింపులే కారణమని సూసైడ్ నోట్‌లో ఆరోపణ**



లైంగిక వేధింపులు తాళలేక సింగరేణి సంస్థలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న ఓ ఇంజనీరింగ్ విద్యార్థిని (21) ఆత్మహత్య చేసుకుంది. ఓవర్‌మ్యాన్ లైంగిక వేధింపులపై యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో మనస్తాపానికి గురై ఈ నిర్ణయం తీసుకుంది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు, బాధితురాలి తండ్రి కథనం ప్రకారం.. గోదావరిఖనికి చెందిన యువతి ఈ ఏడాది ఫిబ్రవరిలో సింగరేణిలోని 2 ఇంక్లైన్ గనిలో ఇంటర్న్‌షిప్ ప్రారంభించింది. అక్కడ పనిచేస్తున్న ఓవర్‌మ్యాన్ బొమ్మకంటి రవికుమార్ ఆమెతో పరిచయం పెంచుకుని, ఆ తర్వాత లైంగికంగా వేధించడం మొదలుపెట్టాడు. ఈ విషయంపై ఆమె సింగరేణి యాజమాన్యానికి ఫిర్యాదు చేయగా, వారు దానిని కొట్టిపారేశారు. దీంతో ఇంటర్న్‌షిప్ మానేసిన యువతి, స్థానికంగా ఓ కంప్యూటర్ సెంటర్‌లో చేరింది. అయినప్పటికీ రవికుమార్‌తో పాటు, ఆమె పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ నవీన్ కూడా వేధింపులు కొనసాగించారు. ఈ వేధింపులు భరించలేక సెప్టెంబర్ 13న ఆమె పురుగుల మందు తాగింది. లెక్చరర్ నవీన్ ఆమెను ఆసుపత్రిలో చేర్పించి పరారయ్యాడు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి ఆమె ప్రాణాలు కోల్పోయింది. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు రవికుమార్, నవీన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులిద్దరూ పరారీలో ఉన్నట్లు సమాచారం.

**సూసైడ్ నోట్‌లో సంచలన విషయాలు :** ఘటనా స్థలంలో లభ్యమైన సూసైడ్ నోట్ ఈ కేసులో కీలకంగా మారింది. ఓవర్‌మ్యాన్ రవికుమార్ తనపై అత్యాచారం చేశాడని, యాజమాన్యం ఫిర్యాదును పట్టించుకోలేదని ఆమె అందులో పేర్కొంది. తన చావుతోనైనా నిందితుడికి కఠిన శిక్ష పడాలని కోరింది.

**దళిత సంఘాల ఆందోళన :** ఈ ఘటనపై దళిత సంఘాలు తీవ్రంగా స్పందించాయి. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, సింగరేణి అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆందోళన చేపట్టాయి. మృతురాలి కుటుంబానికి నష్టపరిహారం, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరాయి. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఫోన్‌లో మాట్లాడి, బాధితులకు న్యాయం చేస్తామని, నిందితులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

పీపుల్స్ డైరీ
వరంగల్
గురువారం, 17 సెప్టెంబరు 2026
సంపుటి : 18, సంచిక : 183


# 90 మంది ఎమ్మెల్యేలు భూకబ్జాలకు పాల్పడ్డారు: బండి సంజయ్

**బీఆర్ఎస్ హయాంలో భూకబ్జాలు జరిగాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు**



కరీంనగర్: బీఆర్ఎస్ హయాంలో పెద్దఎత్తున భూకబ్జాలు జరిగాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు లక్షల ఎకరాల భూములను కబ్జా చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ భూకబ్జాలపై తాను మాట్లాడిన సమయంలో తన తలను ఆరు ముక్కలు నరుకుతానని కేసీఆర్ అన్నారని గుర్తుచేశారు. కేసీఆర్‌ను మెడలు వంచి బయటకు గుంజుకొచ్చింది తానేనని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం తమకు రావాల్సి ఉండగా తృటిలో కాంగ్రెస్ చేతికి వెళ్లిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన భూకబ్జాలను బయటపెట్టడానికి రేవంత్ రెడ్డికి వెయ్యి రోజులు పట్టిందా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్ మధ్య డీల్ కుదరలేదా? ఏఐసీసీకి ఈఎంఐ కట్టడం ఇబ్బందిగా ఉందా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ప్రతి అసెంబ్లీ సమావేశంలోనూ బీఆర్ఎస్‌కు రేవంత్ రెడ్డి ఆఫర్లు ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌లో పనిచేసిన సుమారు 90 మంది ఎమ్మెల్యేలు భూకబ్జాలకు పాల్పడ్డారని బండి సంజయ్ ఆరోపించారు. డ్రగ్స్, ఈ-ఫార్ములా, ఫోన్ ట్యాపింగ్, ఫామ్‌హౌస్ కేసుల దర్యాప్తు ఏమైందని ప్రశ్నించారు. ఈ కేసులపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ఏం చేస్తోందో చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# ఒమన్‌లో చిక్కుకున్న 150 మంది తెలంగాణవాసులు



**జగిత్యాల, సెప్టెంబర్ 16:** ఏజెంట్ల మోసాలకు తెలంగాణ వలస కార్మికులు బలవుతున్నారు. గంగాధర్ అనే ఏజెంట్ చేసిన మోసానికి 150 మంది జగిత్యాల జిల్లావాసులు ఒమన్‌లో చిక్కున్నారు. గంగాధర్ అనే ఏజెంట్ గల్ఫ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షలు వసూలు చేశారని బాధితులు ఆరోపించారు. తమను మోసం చేసి గల్ఫ్‌కు పంపినట్లు వారు తెలిపారు. ఒక పని అని చెప్పిన గల్ఫ్ కంపెనీ తమతో వేరే పని చేయిస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఆ పనికి కూడా సరిగా జీతాలు ఇవ్వడంలేదని, తిండి కూడా పెట్టడం లేదని వారు గోడు వెళ్లబోసుకున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సహకారంతో కొంత మంది సొంత ఖర్చులతో స్వదేశానికి తిరిగి వచ్చారని వారు తెలిపారు. అంత పెద్ద మొత్తంలో తాము ఖర్చు పెట్టుకోలేమని.. తమను స్వదేశానికి తీసుకు వచ్చేలా ప్రభుత్వమే ఏర్పాట్లు చేయాలని బాధితులు ఆవేదన వెల్లగక్కారు. ఈ మేరకు బాధిత కుటుంబాలు జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ను కలిసి, తమ కుటుంబసభ్యులను స్వదేశానికి తిరిగి తీసుకురావాలని విన్నవించుకున్నారు. ఏజెంట్ గంగాధర్‌పై ఇప్పటికే చాలా కేసులున్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు. గతంలో అతడిని అరెస్ట్ చేసి 104 పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకుని, పలువురి వీసాలు సీజ్ చేశారని.. అయినప్పటికీ గంగాధర్ కన్సెల్టెన్సీ పేరు మార్చి మళ్లీ మోసాలకు పాల్పడుతున్నాడని బాధితులు ఆరోపిస్తున్నారు. అతడిని అరెస్ట్ చేసి తగిన శిక్ష విధించాలని వారు డిమాండ్ చేశారు.

# హోటల్‌లో గంజాయి విక్రయం.. ఇద్దరి అరెస్ట్



**హైదరాబాద్, సెప్టెంబర్ 16:** భాగ్యనగంలో మరోసారి భారీగా గంజాయి పట్టుబడింది. గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ అధికారులు అరెస్ట్ చేశారు. కొండాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని ఓ హోటల్‌లో గంజాయి విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించారు. నిందితులు హోటల్‌లో చిన్న చిన్న ప్యాకెట్లుగా గంజాయిని విక్రయిస్తున్నట్లు ఎస్‌టీఎఫ్ అధికారులు తెలిపారు. అస్సాంకు చెందిన ధీరజ్ దాస్ (39), రబాలి అలీ(25)ని అదుపులోకి తీసుకున్న అధికారులు.. వారి వద్ద నుంచి రూ.9 లక్షలు విలువైన 17.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరూ గతంలో హైదరాబాద్‌లో సెక్యూరిటీ గార్డులుగా పనిచేసినట్లు విచారణలో తేలింది. జీతం సరిపోకపోవడంతో గంజాయి విక్రయాల వైపు మళ్లినట్లు ఎక్సైజ్ విచారణలో బయటపడింది. అస్సాం నుంచి గంజాయిని తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఆపై నిందితులిద్దరినీ కొండాపూర్ ఎక్సైజ్ పోలీసులకు ఎస్‌టీఎఫ్ అధికారులు అప్పగించారు.

# తెలంగాణకు భారీ వర్ష సూచన.. 19 నుంచి మూడు రోజుల వానలు

రాష్ట్రంలో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సెప్టెంబరు 19 నుంచి మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, ముఖ్యంగా ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసినట్లు ప్రకటించింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, సెప్టెంబరు 17 నుంచి 22 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. ముఖ్యంగా 19, 20 తేదీల్లో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో 64.5 మి.మీ. నుంచి 115.5 మి.మీ. వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ఈ సమయంలో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీస్తాయని అధికారులు తెలిపారు. భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్.. జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్షించి, సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాల పరిధిలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. మూసీ నదిలోకి నీటిని విడుదల చేయాల్సి వస్తే, లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందస్తుగా హెచ్చరించి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టం చేశారు. ఈ వర్షాలు రాష్ట్రంలో నెలకొన్న వర్షపాత లోటును కొంతమేర తగ్గించవచ్చని భావిస్తున్నారు.

# తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని ఆ ఇద్దరూ మళ్లీ అధికారంలోకి తెస్తారు: శ్రీధర్ బాబు

- రేవంత్ రెడ్డి, మహేశ్ గౌడ్ మధ్య పూర్తి సమన్వయం ఉందన్న శ్రీధర్ బాబు
- రాబోయే ఎన్నికల్లో వీరిద్దరి నాయకత్వంలో కాంగ్రెస్ మళ్లీ గెలుస్తుందని వ్యాఖ్య
- అసెంబ్లీని సుదీర్ఘంగా నిర్వహించడం బీఆర్ఎస్ నేతలకు నచ్చదని విమర్శ



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ల మధ్య అత్యుత్తమ పరిపాలనా, రాజకీయ సమన్వయం ఉందనడంలో ఎలాంటి సందేహం లేదని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ విజన్, పార్టీ నిర్మాణం ఒకే దిశలో పయనిస్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో వీరిద్దరి నాయకత్వంలోనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో తిరిగి ఘన విజయం సాధించి అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీలో చర్చించాలనే తాము భావించామని... అయితే సభకు ముఖం చాటేసే వ్యూహంతోనే కావాలని గందరగోళం సృష్టించి వారు సభ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలకు శాసనసభ ప్రజాస్వామ్య నియమావళి, సభ నిర్వహణ అస్సలు నచ్చవని విమర్శించారు. తమ పదేళ్ల పాలనలో అసెంబ్లీని అతి తక్కువ రోజులు నడిపిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని, ఇప్పుడు ప్రజా ప్రభుత్వం పారదర్శకంగా సుదీర్ఘంగా సభను నిర్వహిస్తుంటే తట్టుకోలేక పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. సభాపతి స్థానాన్ని అవమానిస్తూ, విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలిచేందుకు బీఆర్ఎస్ ప్రజాస్వామ్య వ్యవస్థలను బలిచేస్తోందని శ్రీధర్ బాబు దుయ్యబట్టారు.

# హైదరాబాద్‌లో భూగర్భ జలాల డేంజర్ బెల్స్...

- భాగ్యనగరంలో నీటి కష్టాలు తప్పవా?
- గ్రేటర్ హైదరాబాద్‌లో ఆందోళనకరంగా పడిపోతున్న భూగర్భ జలాలు
- గతేడాదితో పోలిస్తే సగటున 5 మీటర్ల మేర తగ్గిన నీటిమట్టం
- 22 శాతం వర్షపాతం లోటు, పెరిగిన వినియోగమే ప్రధాన కారణం
- కుత్బుల్లాపూర్‌లో ఏకంగా 39 మీటర్లకు పడిపోయిన నీటిమట్టాలు
- ఈ నెల వర్షాలు లేకుంటే తీవ్ర నీటి కష్టాలు తప్పవని హెచ్చరిక



వర్షాకాలం ముగింపు దశకు చేరుకున్నా గ్రేటర్ హైదరాబాద్ వాసులను భూగర్భ జలాల సమస్య తీవ్రంగా వేధిస్తోంది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, మరోవైపు నీటి వినియోగం భారీగా పెరగడంతో భూగర్భ జలాలు అట్టడుగు స్థాయికి పడిపోయాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆగస్టు నాటికి సగటు భూగర్భ జలమట్టం ఏకంగా 4.84 మీటర్లు పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. భూగర్భ జలవనరుల శాఖ విశ్లేషణ ప్రకారం.. ఆగస్టు చివరి నాటికి గ్రేటర్ పరిధిలో సాధారణంగా 460 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 360 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇది సాధారణం కంటే 22 శాతం తక్కువ. వర్షపాతం లోటు కారణంగా నగరవాసులు తాగునీరు, ఇతర అవసరాల కోసం బోర్లపై ఎక్కువగా ఆధారపడ్డారు. ఈ రెట్టింపు ప్రభావంతో భూగర్భ జలాలు శరవేగంగా అడుగంటిపోయాయి. గతేడాది ఆగస్టులో సగటున 6.36 మీటర్ల లోతులో లభ్యమైన భూగర్భ జలాలు, ప్రస్తుతం 11.20 మీటర్ల లోతుకు పడిపోయాయి. నగరంలోని చాలా ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ముఖ్యంగా కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, అమీర్‌పేట్, బాచుపల్లి, శేరిలింగంపల్లి, దుండిగల్, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ వంటి కీలక మండలాల్లో భూగర్భ జలాలు 15 నుంచి 20 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు చేరాయి. అత్యంత దారుణంగా కుత్బుల్లాపూర్ మండలంలో నీటిమట్టాలు 39 మీటర్లకు పైగా లోతుకు పడిపోవడం గమనార్హం. గ్రేటర్ పరిధిలోని మొత్తం 73 శాతం ప్రాంతంలో భూగర్భ జలాలు 10 మీటర్ల కంటే దిగువన ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నెలలో భారీ వర్షాలు కురిసి, భూగర్భ జలాలు తిరిగి పుంజుకుంటేనే కొంత ఉపశమనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. లేనిపక్షంలో రానున్న వేసవిలో భాగ్యనగరవాసులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరిస్తున్నారు. సెప్టెంబర్ వర్షపాతమే హైదరాబాద్ భవిష్యత్ నీటి భద్రతను నిర్ధారిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.

# చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించిన పట్టణ సీఐ,సిబ్బంది

- 24 గంటల్లో హత్య కేసును ఛేదించిన జమ్మికుంట పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించిన పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ పోలీసు సిబ్బంది



**జమ్మికుంట సెప్టెంబర్ 16పీపుల్స్ డైరీ :** జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని తనుగుల గ్రామంలో భూ వివాదం నేపథ్యంలో బొజ్జపల్లి రాజబాబు అనే వ్యక్తి హత్యకు గురైన సంఘటనకు సంబంధించి జమ్మికుంట పోలీసులు కేసును ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

**పోలీసుల విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం:**

మృతుడు బొజ్జపల్లి రాజబాబు తన తల్లి A-3.బొజ్జపల్లి లచ్చమ్మకు చెందిన భూమి విషయంలో కుటుంబ సభ్యులతో తరచూ వివాదాలకు దిగేవాడు. సదరు భూమిని విక్రయించాలని రాజబాబు కోరగా, కుటుంబ సభ్యులు అందుకు అంగీకరించకపోవడంతో వారితో తరచూ గొడవపడుతూ, దూషిస్తూ అసభ్యంగా ప్రవర్తించేవాడని విచారణలో తెలిసింది. ఈ నేపథ్యంలో గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి, సదరు భూమిని మూడు వాటాలుగా విభజించి, ఒక వాటాను తల్లి లచ్చమ్మకు, ఒక వాటాను రాజబాబుకు, మరో వాటాను రాజబాబు తమ్ముడు కుమార్ కుమార్తె సిరిచందనకు ఇవ్వాలని సూచించారు. అయితే, రాజబాబు అందుకు అంగీకరించకుండా, భూమి మొత్తం తనకే చెందాలని పట్టుబట్టాడు. దీంతో గత 8 నెలలుగా లచ్చమ్మ జమ్మికుంటలో అద్దెకు ఉంటోంది. గత పది రోజుల క్రితం తన బిడ్డ ఇంటికి ఆ-3 కవిత వద్ద, లచ్చమ్మ తనుగుల గ్రామంలో వెల్లింది నివసిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో రాజబాబు కుటుంబ సభ్యులపై కక్ష పెంచుకున్నాడు. తేదీ:10-09-2026న మధ్యాహ్నం సుమారు 1.00 గంటల సమయంలో, రాజబాబు అధికంగా మద్యం సేవించి తనుగుల గ్రామంలో నివాసం ఉంటున్న తన బావ అయిన A-1 జూపాక శంకర్ ఇంటికి వచ్చాడు. అక్కడ ఉన్న తన తల్లి A-3 లచ్చమ్మ, తన అక్క A-2 కవితతో గొడవకు దిగాడు. కుటుంబ సభ్యులు అతడిని వారించేందుకు ప్రయత్నించినప్పటికీ, రాజబాబు తన తల్లి లచ్చమ్మ వెంట్రుకలు పట్టుకుని లాగడంతో అక్కడ తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఈ సమయంలో అప్పటికే మద్యం సేవించి ఉన్న A-7. జూపాక శంకర్, A-4. చేతి వెంకటేష్, A-6.మారపెల్లి రాజయ్య, A-5 జూపాక సతీష్ తదితరులు కలిసి రాజబాబును పట్టుకుని చేతులతో కొట్టి మంచంపై పడవేసినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం అతని చేతులు, కాళ్లను మంచానికి కట్టి ఉంచినట్లు తెలిసింది. ఆ తర్వాత జూపాక శంకర్ చున్నీతో రాజబాబు మెడకు బిగించి పట్టుకోవడంతో అతడు మృతి చెందినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. రాజబాబు మృతి చెందినట్లు నిర్ధారించుకున్న అనంతరం, నిందితులు ఈ సంఘటనను దాచిపెట్టే ఉద్దేశంతో మృతదేహాన్ని దుప్పటిలో చుట్టారు. అదే రాత్రి A-1. జూపాక శంకర్, A-6 మారపెల్లి రాజయ్య మరియు A-7. జూపాక శంకర్ s/o లేట్ రామయ్య కలిసి మృతదేహాన్ని సైకిల్‌పై తరలించి, తనుగుల గ్రామ శివారులోని శంకర్‌కు చెందిన పొలానికి తీసుకెళ్లారు. అక్కడ పార, గడ్డపారలతో గుంత తవ్వి మృతదేహాన్ని అందులో పూడ్చిపెట్టి, పైభాగంలో మట్టి మరియు తుమ్మ పొరకతో కప్పి, ఎవరూ గుర్తించకుండా చేసినట్లు విచారణలో వెల్లడైంది.

**పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు:**

మృతదేహాన్ని పూడ్చేందుకు ఉపయోగించిన పార, గడ్డపార, మృతదేహాన్ని తరలించేందుకు ఉపయోగించిన సైకిల్, రాజబాబు మెడ బిగించేందుకు ఉపయోగించిన చున్నీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**జమ్మికుంట పోలీసుల విజ్ఞప్తి**

భూ వివాదాలు, కుటుంబ సమస్యలు లేదా ఇతర వ్యక్తిగత వివాదాల విషయంలో ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా, సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించి చట్టపరమైన మార్గంలో పరిష్కారం పొందాలని జమ్మికుంట పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సెప్టెంబర్ 17 వేడుకలు: కేంద్ర ఉత్సవాలకు ఉపరాష్ట్రపతి.. రాష్ట్ర కార్యక్రమానికి రేవంత్ రెడ్డి

- సెప్టెంబర్ 17న కేంద్రం, రాష్ట్రం వేర్వేరు పేర్లతో వేడుకలు
- కేంద్ర విమోచన వేడుకలకు అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా ఆవిష్కరణ
- రాష్ట్రంలో 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహణ
- సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వేడుకలు





హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలకు ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి, సీఏపీఎఫ్ బలగాల పరేడ్‌ను పరిశీలించనున్నారు. గత కొన్నేళ్లుగా సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఈ వేడుకలు నిర్వహిస్తోంది. తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ తదితరులు కార్యక్రమానికి హాజరుకానున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. ఇదే సమయం లో రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. 32 జిల్లాల కేంద్రాల్లో మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ప్రజాప్రతినిధులు జెండా ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరిం చనున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీల్లోనూ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. ఈ రోజును ఏ పేరుతో నిర్వహించాలన్న దానిపై తెలంగాణలో కొన్నేళ్లుగా రాజకీయ భేదాభిప్రా యాలు ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022, 2023లో 'జాతీయ సమైక్యతా దినోత్సవం'గా నిర్వహించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం 2024 నుంచి 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం మాత్రం 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా వేడుకలు నిర్వహిస్తోంది.

# తెలంగాణ ప్రజలకు జరిగింది విద్రోహమే!

## సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ



**మట్టెవాడ, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** 1948 సెప్టెంబర్ 17వ తేదీన జరిగింది తెలంగాణ ప్రజలకు విద్రోహమేనని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్ అన్నారు. 'సెప్టెంబర్ 17న నిరసన దినం' పాటించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు అధ్యక్షతన ఖిలా వరంగల్ పెట్రోల్ పంప్ విద్యానగర్లో కార్యక్రమం నిర్వహించారు. నాటి తెలంగాణ రాజ్య పాలకులైన నైజాం నవాబు దుర్మార్గ విధానాలకు వ్యతిరేకంగా జరిగిన మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం అభివృద్ధి చెంది కమ్యూనిస్టులు నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారనే భయంతో నెహ్రూ ప్రభుత్వంతో నైజాం నవాబు రాజీపడి తెలంగాణ రాజ్యాన్ని యూనియన్ లో కలిపాడని వారు తెలిపారు. నైజాం ప్రభుత్వం రజాకార్ల దుర్మార్గాలకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ రైతాంగ పోరాటాన్ని అణచివేసేందుకు నాటి నెహ్రూ ప్రభుత్వం హోం మంత్రి వల్లభాయ్ పటేల్ ద్వారా ఆపరేషన్ పోలో పేరిట తెలంగాణ రాజ్యాన్ని దురాక్రమించిందని వారు విమర్శించారు. భూమి కోసం జరిగిన పోరాటం విముక్తి ప్రాంతంగా ఒక నూతన వ్యవస్థను నిర్మాణం చేసుకునే శైశవ దశలోనే అంతమొందించాలని యూనియన్ సైన్యాలు గ్రామాల మీద పడి చేసిన హత్యాకాండలో వేలాది మంది అమరులయ్యా రన్నారు. నేడు చారిత్రక వాస్తవాలను మరుగున పరుచుటకు వివిధ దోపిడి వర్గ పార్టీలు దుష్ట ప్రయత్నాన్ని కొనసాగిస్తున్నా యని అందులో నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి ఈ పోరాటాన్ని హిందూ ముస్లింల మధ్య జరిగిన జరిగినదిగా చిత్రీకరించాలని చూస్తున్నదని అన్నారు. 2014 నుండి నేటి వరకు కేంద్రంలో అధికా రంలో ఉన్న బిజెపి దాని మిత్ర పక్షాలు సామ్రాజ్యవాద దేశాల తొత్తులేనని అన్నారు. మోడీ ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాదా నికి లొంగిపోయి దేశాన్ని తాకట్టు పెడుతు న్నదని హిందూ ఫాసిస్ట్ విధానాలను అమలు చేస్తున్నదని వీటికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాటాలు చేయడమే మార్గమని అన్నారు. ఈ సభలో మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు, ఏఐకేఎంఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు జక్కుల తిరుపతి, ఉపాధ్యక్షులు గట్టి కృష్ణ, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పూలక్క, పిడిఎస్.యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్‌లు మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఐఎఫ్.టియు జిల్లా నాయకులు బండి కుమార్, ఏఐకేఎంఎస్ నాయకులు బండి వెంకటేశ్వర్లు, ఇనుముల కృష్ణ, సలిపాల రమేష్, ఐలయ్య, ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఓజోన్‌ను రక్షిద్దాం! మానవాళిని సంరక్షిద్దాం!!

## పర్యావరణవేత్త రతన్ సింగ్ ఠాగూర్

**మట్టెవాడ, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ):** ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా యూత్ ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో ఓజోన్ యొక్క ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ రతన్ సింగ్ ఠాగూర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఓజోన్ పొర యొక్క ఆవశ్యకత, దాని క్షీణతతో కలిగే నష్టాలను వివరించారు. అలాగే యూత్ ఫర్ సొసైటీ వ్యవస్థాపకుడు కొడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓజోన్ అన్నది వర్షం, ఎండ నుండి గొడుగు ఎలాగైతే మనల్ని కాపాడుతుందో అదే విధంగా సూర్యుని నుండి వచ్చే అతినీల రహిత కిరణాల నుండి సంభవించే దుష్పరిణామాలు (చర్మ వ్యాధులు క్యాన్సర్ ఇతర రకాల రోగాల నుండి) కాపాడుతుందని, ఇది ముఖ్యంగా సిఎఫ్.సి ద్వారా ఇతర పర్యావరణ కాలుష్యం ద్వారా ఓజోన్ పొర పల్చబడడం లేదా హోలు కావడమో జరుగుతుందని దీనివల్ల మానవాళికి, జీవరాశులకి ఎంతో ముప్పు ఏర్పడుతుందని కావున ప్రతి ఒక్కరూ ఈరోజు నుండైనా కాలుష్యాన్ని తగ్గించి చెట్లను పెంచి ప్రకృతిని కాపాడాలని తద్వారా ఓజోన్ పొర నుండి మనల్ని సంరక్షించి కోవాలని భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలని ఈ సందర్భంగా వాలంటీర్లను కోరారు. ముఖ్యంగా వాలంటీర్స్ వీటిపై ప్రజలకు అవగాహన కలిగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా కన్స్యూమర్ ఆర్గనైజేషన్ బాధ్యులు విజయరావు, రాజు, యూత్ ఫర్ సొసైటీ బాధ్యులు దేవిశ్రీప్రసాద్, రాజకుమార్, వాలంటీర్లు ఉమాదేవి, లక్కీ, రక్షిత, సభ, మలిహా, సుచిత, సహస్ర తదితరులు పాల్గొన్నారు.

# పెనుగొండలో 70వ జోనల్ స్థాయి క్రీడలు



**కేసముద్రం, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ):** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే 70వ నెల్లికుదురు జోనల్ స్థాయి క్రీడలను పెనుగొండ గ్రామంలో ఈనెల 18 మరియు 19 తేదీలలో నిర్వహించనున్నట్లు క్రీడల చైర్మన్, మండల విద్యాశాఖాధికారి కాలేరు యాదగిరి, జోనల్ కార్యదర్శి దామల్ల విజయచందర్ తెలిపారు. ఈ క్రీడల్లో కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు మూడు మండలాల నుండి 14 మరియు 17 సంవత్సరాల విభాగంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడల్లో దాదాపు 500 మంది క్రీడాకారులు మరియు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొంటారని వారు పేర్కొన్నారు. పాల్గొనే క్రీడాకారులందరికీ ఉచిత భోజన వసతి కల్పిస్తున్నామని, గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. జోనల్ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు మహబూబాబాద్ జిల్లాలో జరిగే జిల్లా స్థాయి క్రీడల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఈ క్రీడల నిర్వహణకు కావాల్సిన గ్రౌండ్, ఇతర సదుపాయాలను క్రీడా పోషకులు కంకల కొమురయ్య పర్యవేక్షణలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు డాక్టర్ కొమ్ము రాజేందర్, టి. ప్రణయ్, రవికుమార్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ సభను విజయవంతం చేయాలి



**నర్సంపేట, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ నర్సంపేట నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో సెప్టెంబర్ 27న హన్మకొండ హంటర్‌రోడ్‌లో జరగబోయే ఎవరి కులం ఎంతో వారికంత వాటా బహిరంగ పంచాయతీ సభ కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ స్టేట్ కోఆర్డినేటర్ రామగిరి యాదగిరి స్వామి, నర్సంపేట నియోజకవర్గ బీసీ ఎస్సి ఎస్టి జేఏసీ ఇంచార్జ్ ముంజాల రాజేందర్ గౌడ్ ,ఆబోతు రాజు యాదవ్ బిసి పవర్ రాష్ట్ర అధ్యక్షులు, బిసి సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు సోల్తి సారయ్య ,సంగాల శివకృష్ణ, జేఏసీ నర్సంపేట మండల కోఆర్డినేటర్ జిల్లా గౌరవ సలహాదారులు గుంపుల మల్లయ్య,కూస రాజేందర్,ఎండి పాషా, ఓదెల సురేష్,రామగిరి రవీందర్,కందికట్ల సురేష్,రామగిరి రాజు,పాల్గొన్నారు. కార్యక్రమాన్ని బీసీలు ఎస్సీలు ఎస్టీలు మహిళలు ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# సర్పంచుల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మాదారపు సత్తన్న ఇకలేరు



**కేసముద్రం, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** సర్పంచ్ ల ఫోరం మహబూబాబాద్ జిల్లా మాజీ అధ్యక్షులు, వెంకటగిరి గ్రామ మాజీ సర్పంచ్, వెంకటగిరి గ్రామ శ్రీమంతుడు అని పిలిచే మాదారపు సత్యనారాయణ రావు బుధవారం మృతి చెందారు. తెలుగుదేశం పార్టీలో తెలుగు యువత మండల అధ్యక్షులుగా, అటు తర్వాత కాంగ్రెస్ పార్టీలో పని చేసిన మాదారపు తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు ఐన తర్వాత వెంకటగిరి గ్రామ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికై జిల్లా సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు గా వ్యవహరించారు.

### కాంట్రాక్టర్‌గా ఎంతో మందికి సపరిచితులు

వివిధ రాజకీయ పార్టీల్లో క్రియాశీలకంగా పనిచేసిన సత్తన్న కాంట్రాక్టర్గా అవతారమెత్తారు. కేసముద్రం మండలంలో రాజకీయ నాయకులుగా చలామణి ఐన సత్తన్న కాంట్రాక్టర్ గా ఎంతో మందికి సుపరిచితులు. సత్తన్న మరణ వార్త తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు, అయన అభిమానులు, వెంకటగిరి గ్రామస్తులు,అధికారులు తండపతండాలుగా తరలి వచ్చి ఆయనకు నివాళులర్పించారు.దన్నసరి సొసైటీ చైర్మన్ మర్రి రంగారావు, ఐజేయు మాజీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండి సంపత్ కుమార్, ఐజేయు జిల్లా కమిటీ మెంబర్ దూదికట్ల రామాచారి, మాజీ జడ్పీటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు గుగులోతు వీరునాయక్, సొసైటీ డైరెక్టర్ కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి, పీడీఎస్ఎస్ అధ్యక్షుడు బనిశెట్టి వెంకటేష్ తోపాటు పలువురు నాయకులు పూలమాలలు వేసి సంతాపం తెలిపారు.



# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి!

## మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రెటరీ/సీడీఎంఏ డాక్టర్ టి.కె.శ్రీదేవి



**మట్టెవాడ, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ):** వరంగల్ నగర సమగ్ర అభివృద్ధిలో అత్యంత కీలకమైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా త్వరతంగా పూర్తి చేసి నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పనులను ప్రారంభించాలని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రెటరీ, సీడీఎంఏ డాక్టర్ టి.కె.శ్రీదేవి అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వరంగల్ నగర యూజీడీ ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నిర్వహించారు. హన్మకొండ సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నుండి బల్దియా ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయ్, కమిషనర్ టి.వెంకన్న పాల్గొని ప్రాజెక్టు ప్రస్తుత స్థితిగతులు, చేపట్టిన చర్యలను సీడీఎంఏకు వివరించారు. ఈ సందర్భంగా సీడీఎంఏ శ్రీదేవి మాట్లాడుతూ యూజీడీ పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేసి, పనులను వేగవంతంగా ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచిం చారు. ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత మార్గదర్శకాలు, సాంకేతిక ప్రమాణాలు, సంబంధిత నివేదికలను సమగ్రంగా పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నగర పారిశుద్ధ్యం, మురుగు నీటి నిర్వహణను మెరుగు పరచడంతో పాటు నగర సమగ్ర అభివృద్ధికి యూజీడీ ప్రాజెక్టు ఎంతో కీలకమని పేర్కొంటూ సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులో పనులు ప్రారంభించి, నిర్ణీత కాలంలో పూర్తి చేసేలా పటిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని సీడీఎంఏ ఆదేశించారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు సంబంధించి టెండర్ల ఆహ్వానానికి చర్యలు చేపడతామని తెలిపారు. ఇందుకు అవసరమైన ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు సిడిఎంఏకు వివరించారు. ప్రాజెక్టుకు సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో బల్దియా సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్ కుమార్, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఈఈలు రవి కుమార్, సంజయ్ కుమార్, పబ్లిక్ హెల్త్ డీఈ కార్తీక్ రెడ్డి, టీపీఎస్ అవినాష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 13 మందికి జరిమాన

**మట్టెవాడ, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ):** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతారెడ్డి, ట్రాఫిక్ అదనపు డీసీపీ ఆర్.ప్రభాకర్‌రావు, ట్రాఫిక్ ఏసిపి టి.సత్యనారాయణ పర్యవేక్షణలో డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 15 మంది వ్యక్తులను వరంగల్ సెకండ్ క్లాస్ కోర్టు 3వ స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ అంకేశ్వరపు కమలాకర్ ఎదుట హాజరుపరచగా నల్లబెల్లికి చెందిన పెండ్లి సురేష్(30), రాయపర్తికి చెందిన దంతమల్ల శివకుమార్ (28)లకు) నాలుగు రోజులు జైలుశిక్ష విధించగా పరకాల సబ్ జైలుకు పంపి, మిగతా 13 మంది వ్యక్తులకు కోర్టు రూ.11,700 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కోడూరి సుజాత తెలిపారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడిపిన ఇద్దరు వాహన దారులకు కోర్టు రూ.1300 జరిమానా విధించినట్లు సీఐ సుజాత వెల్లడించారు.



# భక్తికి నిదర్శనం

## 13 ఏళ్ల బాలుడి చేతిలో 7 అడుగుల మట్టి గణపతి

**కేసముద్రం, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** భక్తికి వయసుతో పనిలేదని నిరూపించాడు కేసముద్రం మండలానికి చెందిన బాలుడు. కేసముద్రం మండలం పెద్దమొర్రి తండా గ్రామపంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన బండారి మన తేజ (13 సంవత్సరాలు, 9వ తరగతి) తన ఆరు నెలల కఠోర శ్రమతో 7 అడుగుల భారీ గణనాథుడి విగ్రహాన్ని తయారు చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. పూర్తిగా మట్టితోనే ఈ విగ్రహాన్ని తయారు చేయడం విశేషం. విగ్రహ తయారీ ప్రారంభించినప్పటి నుండి పూర్తయ్యే వరకు ఒక్కరోజు కూడా నాన్ వెజ్, గుడ్డు తినకుండా, అత్యంత భక్తి శ్రద్ధలతో నియమ నిష్టలు పాటిస్తూ ఈ విగ్రహాన్ని రూపొందించాడు.

# మున్సిపల్ అధికారులపై బీఆర్ఎస్ కౌన్సిలర్ల ఆగ్రహం

## కేసముద్రం మున్సిపాలిటీలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలు..



**కేసముద్రం, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ):** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో తాగునీరు, డ్రైనేజీ, దోమల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ.. పలు వార్డుల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేదని, వచ్చిన నీరు కూడా మురికిగా ఉంటోందని ఆరోపించారు. డ్రైనేజీలు పూడుకుపోయి మురుగునీరు రోడ్లపైకి వస్తుందని, దీంతో దోమల బెడద పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి తాగు నీటి సరఫరాను మెరుగుపరచాలని, డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా శుభ్రం చేయాలని, ప్రతి వార్డులో దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వినయ్ రెడ్డి, శరత్ యాదవ్, రాము, కృష్ణ, సుజాత హరి, శారదా సురేష్, రాజమణి, అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి!

## అధికారుల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు - గ్రేటర్ కమిషనర్ టి.వెంకన్న



**మట్టెవాడ, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలను సజావుగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని జిడబ్ల్యూఎంసి కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు.ఎబుధవారం వరంగల్ నగరంలోని చిన్నవడ్డేపల్లి చెరువులో గణేష్ నిమజ్జన ప్రాంతాన్ని కమిషనర్ పరిశీలించారు. నిమజ్జన ప్రాంతంలో చేపట్టాల్సిన పారిశుద్ధ్య, ఇంజినీరింగ్, రహదారి తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం కోసం అధిక సంఖ్యలో గణేష్ విగ్రహాలు తరలివచ్చే అవకాశం ఉన్నందున, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇరిగేషన్, జిడబ్ల్యూఎంసి, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో నిమజ్జన ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా చెరువులోకి గుర్రపుడెక్క చేరిన నేపథ్యంలో నిమజ్జనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చెరువులో మిగిలి ఉన్న గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ, రహదారులు, లైటింగ్, భక్తుల రాకపోకలు తదితర అంశాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

### దేశాయిపేటలో పారిశుద్ధ్యం పరిశీలన

అనంతరం కమిషనర్ 12వ డివిజన్ పరిధిలోని దేశాయిపేట ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ప్రధాన రహదారులు, పరిసర ప్రాంతాలు, డివైడర్లు తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుద్ధ్య పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. బిల్‌బోర్డులు, అడ్వర్టైజింగ్ బోర్డులు, అనధికార ఫ్లెక్సీలు తదితరాలు ఏర్పాటు కాకుండా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రతి ఇంటి నుంచి స్వచ్ఛ ఆటో ద్వారా తడి, పొడి చెత్తను క్రమం తప్పకుండా వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెత్త సేకరణలో ఎలాంటి జాప్యం లేకుండా, నిర్ణీత ప్రణాళిక ప్రకారం పారిశుద్ధ్య కార్యక్రమాలు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రణాళిక ప్రకారం స్వీపింగ్ మిషన్ల ద్వారా రహదారులను శుభ్రం చేయడంతో పాటు డివైడర్లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ పరిశీలనలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సూపర్‌వైజర్ గోల్కొండ శ్రీను, శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రశాంత్, జవాన్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ

## సీపీఐ మండల నాయకులు మంద భాస్కర్

**కేసముద్రం, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరిస్తోందని సీపీఐ మండల నాయకులు మంద భాస్కర్ ఆరోపించారు. బుధవారం కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, దొరల, భూస్వాముల ఆగడాలను అరికట్టేందుకు సాయుధ పోరాటమే ఏకైక మార్గమని రావి నారాయణ రెడ్డి, మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డిలు పిలుపునివ్వడంతో 1946 సెప్టెంబర్ 11 నుండి ఆంధ్ర మహాసభ, భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో "బాంచన్ కాల్మొక్త దొర" అంటూ సామాన్య ప్రజలను చైతన్యపరిచి వీరోచిత పోరాటం చేశారన్నారు. ఈ సాయుధ పోరాటంలో 4,500 మంది కమ్యూనిస్టులు అమరులయ్యారని, కమ్యూనిస్టు పార్టీ పోరాటానికి భయపడి నిజాం సర్కార్ లొంగిపోయాడని అన్నారు. ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ ఇలాంటి వీర చరిత్ర కలిగిన



పోరాటాన్ని, సాయుధ పోరులో ఎలాంటి పాత్ర లేని బీజేపీ, ఆరెస్సెస్ మత ఛాందసవాదు లు హిందూ-ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చరిత్రను వక్రీకరించడం సిగ్గుచేటని విమర్శించారు. సెప్టెంబర్ 17న మహబూబాబాద్ లో సీపీఐ ఆధ్వర్యంలో జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజు, మంచాల శ్రీను, తాటికాయల యాకయ్య, గణేష్, నాగన్న, నరేష్, సాయి కిరణ్, పాషా, ప్రశాంత్, బద్రు తదితరులు పాల్గొన్నారు.

# విలీన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

**ఏన్కూరు, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతు పోరాటం చరిత్రలో గొప్ప పోరాటమని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత్ రావు పేర్కొన్నారు. ఏన్కూర్ మండలం మేడపల్లి గ్రామంలో లో తాటి సత్యం, తాటి సీతమ్మ స్తుపాల వద్ద జరిగిన సభలో మాట్లాడారు. ముందు స్తుపల వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ జెండా ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హేమంత్ రావు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, జమీందార్లు, జగిర్దర్లకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటం 5 వేల గ్రామాలను,10 వేల ఎకరాలు భూమి పంచిన చరిత్ర కమ్యునిస్టులకు ఉందన్నారు. అదే స్ఫూర్తితో తెలంగాణను విముక్తి చేసి భారతదేశంలో విలీనం చేయడంలో ఆనేక కమ్యూనిస్టుల ప్రాణ త్యాగలతో జరిగిందని, అలాంటి గొప్ప పోరాటాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. నల్లమల గిరి ప్రసాద్ దళంలో పని చేసిన తాటి సత్యం



తాటి సీతమ్మ గార్లు ధన్య జీవులన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు యర్రా బాబు, మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్, జిల్లా సమితి సబ్యులు అమరనేని వీరభద్రం, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బానోత్ రాంబాబు, మండల నాయకులు మదినేని రమేష్, గ్రామ సర్పంచ్ బండ్ల స్వాతి,కృష్ణారావు, తిరుపతమ్మ, సూరమ్మ , కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

## ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు రాంచందర్ మాదిగ



**చిట్యాల, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని భారత రాజ్యాంగం జోలికి వస్తే సహించమని భారతదేశంలో భారత రాజ్యాంగం ద్వారానే పాలనా వ్యవస్థ జరుగుతుందని ఎమ్మార్పీ ఎస్ జిల్లా సీనియర్ నాయకులు రామ్ రాంచందర్ మాదిగ అన్నారు. బుధవారం ఆయన టేకుమట్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందరివాడు అని ఆయన రాసిన భారత రాజ్యాంగ ఫలాలు అన్ని వర్గాల ప్రజలు అనుభవిస్తున్నారని దేశం లో అవగాహన లేని కొంతమంది వ్యక్తులు భారత రాజ్యాంగాన్ని విమర్శించడం సరికాదు అన్నారు. భారత రాజ్యాంగం పై దాడి చేస్తే ప్రజాస్వామ్యం పై దాడి చేసినట్లేనని దీన్ని ప్రతి ఒక్కరు ఖండించవలసిన అవసరం ఉందన్నారు. భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ను అవమానపరిచే వ్యక్తులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కేసులు నమోదు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాలను కోరారు.

# 36 ఏళ్లుగా వినాయక ప్రతిష్ఠ.. అభినందనీయం



**గణపురం, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండల కేంద్రంలోని గుడివాడలో శ్రీరామ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడిని ఎస్ఐ బి.అశోక్ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీరామ యువజన సంఘం ఆధ్వర్యంలో 36 సంవత్సరా లుగా వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఉత్సవాలను నిర్వహిస్తు న్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ బి. అశోక్ మాట్లాడుతూ... మూడు దశాబ్దా లకు పైగా వినాయక ఉత్సవాలను సంప్రదాయబ ద్ధంగా నిర్వహిస్తూ వస్తున్న శ్రీరామ యువజన సంఘం సభ్యులను అభినందించారు. ప్రతి ఏటా భక్తిశ్రద్ధల తో ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమ న్నారు. వినాయక ఉత్సవాలను భక్తి, శ్రద్ధలతో పాటు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి మోటపోతుల శివ శంకర్ గౌడ్, యువజన సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు

# గ్రామాలలో ఘనంగా గణపతి ఉత్సవాలు



**ఏన్కూరు, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** మండల వ్యాప్తంగా గణపతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వాడ వాడలా గణనాథులు కొలువుదీరి పూజలు అందుకుంటున్నారు. పార్వతీ పరమేశ్వరుల కుమారుడైన గణపతి పుట్టినరోజు వినాయక చవితిగా జరుపుకుంటారు. ఈ పండుగ భాద్రపద మాస శుక్ల పక్ష చతుర్థి నాడు ప్రారంభమవుతుంది. ఈ పండుగను తొమ్మిది రోజులు జరుపుకుంటారు. వినాయకుడికి ఇష్టమైన పదార్థాలైన ఉండ్రాళ్ళు, లడ్డులు, కుడుములు, పండ్లు నైవేద్యంగా సమర్పిస్తారు. ఉదయం, రాత్రి వేళల్లో మండపాలలో కొలువుదీరిన గణనాథులకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. వినాయక ఉత్సవాలతో గ్రామాలలో సందడి నెలకొంది

# గురుకుల పాఠశాలను సందర్శించిన ప్రత్యేక అధికారి



**ఏన్కూరు, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూరు గురుకుల విద్యాలయాన్ని బుధవారం మండల ప్రత్యేక అధికారి ఎండి ముజాహిద్ ఖాన్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులను, గ్రంథాలయాన్ని, డార్మెంటరీ, భోజనశాల, వంట గదులను పరిశీలించారు. టి ఎల్ ఎం తో ఉపాధ్యాయుల బోధనలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. చిన్ననాటి నుండే క్రమశిక్షణ, పట్టుదల, నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు. లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ, ఎంఈఓ వాసవి దేవి,ప్రిన్సిపాల్ వేము రాజు, ఏటీపీ శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

# హమారా ప్రసాద్‌ను అరెస్టు చేయాలి

## పోలీసులకు ఫిర్యాదు చేసిన మాల మహానాడు నాయకులు



**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేశారంటూ హమారా ప్రసాద్‌పై జాతీయ మాల మహానాడు నాయకులు ఇల్లందు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంబేద్కర్‌ను 'కల్పిత నాయకుడు'గా పేర్కొంటూ పుస్తకం రచించడాన్ని నిరసిస్తూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ చరిత్ర, ఆయన సాగించిన సామాజిక పోరాటాలు, భారత రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పోషించిన కీలక పాత్రను కించప రిచేలా వ్యాఖ్యలు చేయడం, పుస్తకం రచించడం అభ్యంతరకర మని నాయకులు పేర్కొన్నారు. కోట్లాది మంది ప్రజలకు గౌరవనీయుడైన అంబేద్కర్‌ను అవమానించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను 'కల్పిత నాయకుడు'గా పేర్కొంటూ రాసిన పుస్తకాన్ని వెనక్కి తీసుకుని, ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరారు. అంబేద్కర్ గౌరవాన్ని, రాజ్యాంగ విలువలను పరిరక్షించేందుకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు పట్టణ మాల మహానాడు అధ్యక్షుడు వేమూరి సాల్మన్ రాజు, ఉపాధ్యక్షుడు మలిపెద్ది కమలాకర్, కార్యదర్శి అబ్బూరి సునీల్, జాయింట్ సెక్రటరీలు చెన్నమల్ల రామకృష్ణ, మంద శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర ఉద్యమంలో హిందీ బాష కీలకం

## హెడ్‌మాస్టర్ లింగాల కుమారస్వామి

**మొగుళ్లపల్లి, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన హిందీ దివాస్ కార్యక్రమాన్ని ఉద్దేశించి దేశ స్వాతంత్ర ఉద్యమంలో హిందీ బాష అత్యంత కీలకమైందిగా పాఠశాల హెడ్ మాస్టర్ లింగాల కుమారస్వామి అన్నారు. పాఠశాలలో హిందీ దివస్ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని హిందీ ఉపాధ్యాయులు నోముల రవీందర్, విద్యార్థులతో ఆకర్షణీయమైన బోధన కృత్యాలను తయారు చేయించి ప్రదర్శింపచేశారు. అనంతరం విద్యార్థులు ఉపన్యాసాలు, పద్యాలు, పాటలు నృత్య ప్రదర్శన చేశారు. హెడ్ మాస్టర్ లింగాల కుమారస్వామి, మాట్లాడుతూ. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో హిందీ భాష కీలక పాత్ర పోషించిందని ప్రపంచ వ్యాప్తంగా 200 లకు పైగా విశ్వవిద్యాలయాల్లో హిందీ భాషను బోధిస్తున్నారని, 1949 సెప్టెంబర్ 14న భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 343 (1) ప్రకారం హిందీని కేంద్ర ప్రభుత్వ



రాజభాషగా గుర్తించారని తెలిపారు. తదుపరి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మెరిపురి స్వరూప, చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు. టీచర్స్ నరసింహస్వామి, సంపత్ కుమార్, వీరయ్య, ఉమారాణి, కె రవీందర్, గ్లోరీరాణి, శకుంతల, శోభా రాణి, కవిత, సందీప్, విద్యార్థులు ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ సరిత, ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, సి. ఆర్. పి. లు వసంత, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా పాదయాత్రకు తరలిరండి

**మొగుళ్లపల్లి, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో బీసీల రాజ్యాధికార పాదయాత్రను నేడు హైదరాబాద్‌లోని గోల్కొండ నుంచి తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రారంభించనున్నారని, బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా జిల్లాలోని ప్రజలందరూ ప్రారంభ పాద యాత్ర కు తరలిరావాలని. తెలంగాణ రాజ్యాధికార పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రవి పటేల్ పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ, బీసీ లకు రాజ్యాధికారం, సామాజిక సమానత్వం సాధించా లనే లక్ష్యంతో తీన్మార్ మల్లన్న 14,500 కిలోమీటర్ల పాదయాత్రను చేపడుతున్నట్లు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో గోల్కొండకు తరలివచ్చి, సమాజంలో అన్ని వర్గాలకు సమాన అవకాశాలు అందేలా ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, సామాజిక న్యాయాన్ని కోరుకునే ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రకు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు ప్రణయ్ రాజ్, వెంకటేష్, సంతోష్, శ్రీను, రాంబాబు, సతీష్, ముక్తేశ్వర్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# సీఐని కలిసిన ప్రజా సంఘాల నాయకులు



**చిట్యాల, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** ఇటీవల చిట్యాల సీఐ గా బాధ్యతలు స్వీకరించిన వై సతీష్ ను టేకుమట్ల మండల దళిత ప్రజా సంఘాల నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని ఎస్సీ ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని వారు సీఐ ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎలుకటి రాజయ్య శాస్త్రాల తిరుపతి ఆరకోండ రాజయ్య రేణుకుంట్ల రాము బొజ్జపెల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలోనే మెరుగైన విద్య, నాణ్యమైన ఆహారం

## వేములపల్లి గ్రామ సర్పంచ్ ఆరెల్లి రమేష్

**మొగుళ్ళపల్లి, సెప్టెంబర్ (పీపుల్స్ డైరీ) :** మండలంలోని వేములపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణాదేవి ఆధ్వర్యంలో పోషణ మహా ప్రోగ్రాము సందర్భంగా 'మన అంగన్వాడీ మన బాధ్యత ' అనే థీమ్ తో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ ఆరెల్లి రమేష్ పాల్గొన్నారు. అంగన్వాడి కేంద్రంలోని పిల్లలకు మెరుగైన విద్య నాణ్యమైన పౌష్టిక ఆహారం లభిస్తుందని వేములపల్లి గ్రామ సర్పంచ్ ఆరెల్లి రమేష్ అన్నారు. ఆయన మాట్లాడుతూ. మహిళలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, లబ్ధిదారులు పోషకాలు ఎక్కువగా ఉన్నటువంటి ఆకుకూరలతో పాటు అన్ని రకాల పోషకాలు ఉండేటువంటి ఆహారం, అన్నంతో పాటు చిరుధా న్యాలు, పప్పుల లో ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయని, ఆకుకూరలు, కోడిగుడ్లు పాలు, చేపలు ఆహారంగా తీసుకోవా లని సర్పంచ్ అన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణాదేవి మాట్లాడుతూ లబ్ధిదారులం దరూ ముఖ్యంగా పిల్లలకు జంక్ ఫుడ్ ఇవ్వకూడదని, ఫోన్‌లు చూపించడం చేస్తూ. భోజనం తినపెట్టకూడదని అంగన్వాడీ సెంటర్స్ లో ఇచ్చే భోజనం మెనూ గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరేళ్ల రమేష్, కొత్తూరీ శంకర్, స్కూల్ హెడ్ మాస్టర్ జ్యోతి, సబ్ సెంటర్ డాక్టర్ సంధ్య, అంగన్వాడీ టీచర్స్ స్వరూప, సబిత, జ్యోతి, అనిత, ఏఎన్ఎం ఆశా, అంగన్వాడీ ఆయా ప్రీ స్కూల్ పిల్లలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**ఏన్కూర్, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర 4వ మహాసభలు ఈనెల 27, 28 తేదీల్లో హైదరాబాద్ సంతోష్‌నగర్‌లో జరుగుతున్నాయని, ఈ మహా సభలను విజయవంతం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బానోతు బాలాజీ, భూక్యా వీరభద్రం కోరారు. బుధవారం ఏన్కూర్ ప్రజా సంఘాల కార్యాలయం వద్ద తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఏన్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోత్ లచ్చిరాం నాయక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల హక్కులు, భూమి, అటవీ హక్కులు, రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ గిరిజన సంఘం నిరంతరం పోరాడుతోందన్నారు. రాష్ట్ర మహాసభల్లో గిరిజనుల సమస్యలు, హక్కుల పరిరక్షణ, భవిష్యత్ కార్యాచరణపై చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. గిరిజనులు, ప్రజా సంఘాల నాయకులు, యువత, మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లచ్చిరాం నాయక్ మాట్లాడుతూ తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభల విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం జరిగే ఈ మహాసభలకు ప్రజల మద్దతు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కట్రం గంగరాజు, వాంకుడోత్ హతిరామ్ నాయక్, గొర్రె మేకల పెంపకదారుల సంఘం జిల్లా నాయకులు దొంతబోయిన నాగేశ్వరరావు, సీఐటీయూ మండల కన్వీనర్ ఏర్పుల రాములు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఇటికల లెనిన్, ఎట్టి మనీష్, రమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతిఒక్క ఓటరు తుది ఓటరు జాబితాలో స్థానం పొందాలి : కలెక్టర్

## ఎస్ఐఆర్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** అర్హులైన ప్రతిఒక్క ఓటరు తుది జాబితాలో స్థానం పొందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సవరించిన షెడ్యూల్, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార ప్రక్రియపై ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు వ్యవధి ఆగస్టు 17 నుండి నుండి అక్టోబర్ 7 వరకు ఉందన్నారు. నోటీసుల డిస్పోజల్, అపీళ్ల పరిష్కారానికి నవంబర్ 5 వరకు గడువు ఉండి, తుది ఓటరు జాబితాను నవంబర్ 9న ప్రచురించనున్నట్లు తెలిపారు. నూతనంగా ఓటరు నమోదు కోసం ఫారమ్ 6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ కాపీని తప్పనిసరిగా జతచేయాలని కలెక్టర్ తెలిపారు. ఫిజికల్ హియరింగ్ సమయంలో దరఖాస్తుదారులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా హాజరుకావాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో మొత్తం 1,75,841 నోటీసులకు గాను ఇప్పటివరకు 1,60,623 నోటీసుల పంపిణీ చేసి, 91.34 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. ఇప్పటివరకు 81,446 మందికి విచారణ పూర్తి చేసి, దరఖాస్తులను దరఖాస్తులు పరిష్కరించామన్నారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో దాదాపు 12,000 నోటీసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఖమ్మం నగర పరిధిలో ఆన్‌లైన్ ద్వారా ఎన్యుమరేషన్ ఫారమ్‌లు సమర్పించిన పట్టణ ఓటర్లు అందుబాటులో లేకపోవడం వల్ల దాదాపు 9,000 నుండి 12,000 వరకు నోటీసుల పంపిణీకి ఇబ్బంది ఎదురవుతోందన్నారు. నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియ విజయవంతం కావడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు క్రియాశీలకంగా పాల్గొని సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పట్టణ ప్రాంతాల్లో సర్వే నిర్వహించినప్పుడు మెజారిటీ ప్రజలు పదవ తరగతి సర్టిఫికేట్లను ఆధారాలుగా చూపుతుండగా, గ్రామీణ ప్రాంతాల్లో కుల ధృవీకరణ పత్రాలపై ఎక్కువగా ఆధారపడుతున్నారని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి.శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్డీసి సదానందం, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పసుమర్తి శ్రీనివాస్, బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బి.వేణు గోపాల్, బిజెపి పార్టీ ప్రతినిధి వి.రాజేష్, సిపిఐ (ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్, అధికారులు, తదితరులున్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

## ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను తనిఖీ చేసిన కలెక్టర్

### బిఎల్ఓలు సరైన ప్రణాళికతో విధులు నిర్వహించాలి



**ఖమ్మం, సెప్టెంబరు 16 (పీపుల్స్ డైరీ) :** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం మ్యాపింగ్ కానీ, అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసుల జారీ, డాక్యుమెంట్స్ అప్లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక బస్ డిపో రోడ్, పాత డిఆర్డీఏ కార్యాలయ పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు నిర్వహిస్తున్న విధులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనామిలిస్, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను బిఎల్ఓలు యాప్‌లో నమోదు చేసే విధానాన్ని పరిశీలించారు. ప్రత్యక్షంగా హియరింగ్‌కు హాజరైన ఓటర్లతో ఎదురైన సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత తేదీల్లో హియరింగ్‌కు హాజరయి బిఎల్వోలకు అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై బిఎల్వోలు సరైన ప్రణాళికతో విధులు నిర్వహించాలని, నోటీసులు అందుకున్న వారిలో ఏ,బి,సి కేటగిరీల వారీగా సంబంధిత ఓటర్లతో అవసరమైన డాక్యుమెంట్లను మాత్రమే తీసుకోవాలని, కుల ధృవీకరణ పత్రాలు అవసరమైన వారికి మంజూరు చేసేలా ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు గల్లంతు కాకుండా తప్పులు లేని, పారదర్శకమైన సమగ్ర ఓటరు జాబితాను రూపొందించాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్‌ను జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ అన్నారు. మ్యాపింగ్ కాని, అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసులు జారీ చేశాక, నిర్దేశిత తేదీల్లో హియరింగ్‌కు హాజరయ్యేలా చూడాలన్నారు. అవసరమైన వారికి కులధృవీకరణ పత్రాలు తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు. నోటీసుల జారీ, ఓటర్ల హియరింగ్, ఫారాల స్వీకరణ, అప్‌లోడింగ్ ప్రక్రియలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఓటర్లు సమర్పించే ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వాటిపై తప్పనిసరిగా సంబంధిత ఓటర్ల సంతకాలు తీసుకోవాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరు వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రక్రియను నిర్వహించాలని, విధులు కేటాయించిన సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, బిఎల్ఓలు, ఎన్నికల సిబ్బంది, తదితరులున్నారు.

# భూ రీ-సర్వేకు క్షేత్రస్థాయి భూమే ప్రమాణికం

## ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీ సర్వే ను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

### అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూ రీ-సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి

### రైతుల సమక్షంలో పారదర్శకంగా సర్వే నిర్వహించి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

### రీ-సర్వే సమయంలో రైతులు అందుబాటులో ఉండి అధికారులకు సహకరించాలి



**ఖమ్మం, సెప్టెంబరు 16 (పీపుల్స్ డైరీ) :** భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ఖచ్చితమైన భూ రికార్డులను రూపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన భూ రీ-సర్వేకు క్షేత్రస్థాయిలో ఉన్న భూమే ప్రామాణికమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. రైతులు, భూ యజమానుల సమక్షంలో రోవర్, ట్యాబ్ తదితర ఆధునిక సాంకేతిక పరికరాలతో నిర్వహిస్తున్న డిజిటల్ సర్వే ప్రక్రియను పరిశీలించారు. సర్వే విధానం, ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ రైతులతో నేరుగా మాట్లాడి భూ రీ-సర్వే ఉద్దేశ్యం, చేపడుతున్న ప్రక్రియపై అవగాహన కల్పించారు. రైతుల సందేహాలు, అనుమానాలను అడిగి తెలుసుకుని, వాటిని నివృత్తి చేశారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి అపోహలకు తావులేకుండా రైతుల సమక్షంలోనే ప్రతి అంశాన్ని పరిశీలించి నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ... భూమి ఉండి పట్టాదారు పాస్‌బుక్‌లు లేని వారు, పట్టాదారు పాస్‌బుక్‌లు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయి వివరాలకు రికార్డుల్లోని వివరాలకు పొంతన లేని వారు, అలాగే రికార్డుల్లో భూమి వివరాలు నమోదు కాని సందర్భాలను రీ-సర్వే ద్వారా గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు. భూ రీ-సర్వేలో ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఎవరు భూమిని సాగు చేస్తున్నారు, వారి పేరుపై ఎంత విస్తీర్ణం నమోదై ఉంది, పట్టాదారు పాస్‌బుక్ ఉందా లేదా, రికార్డుల్లో నమోదైన వివరాలు క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోతున్నాయా అనే అంశాలను సమగ్రంగా పరిశీలించాలని అన్నారు. పట్టాదారు పాస్‌బుక్‌లో నమోదైన విస్తీర్ణం, క్షేత్రస్థాయిలో ఉన్న విస్తీర్ణం మధ్య తేడా ఉందా లేదా అనే విషయాన్ని చుట్టుపక్కల రైతుల సమక్షంలో కొలతలు నిర్వహించి నిర్ధారించాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో పంచనామా నిర్వహించి వివరాలను నమోదు చేయాలని, విస్తీర్ణంలో ఎక్కువ లేదా తక్కువ ఉన్నట్లయితే అందుకు గల కారణాలను పూర్తిగా పరిశీలించి, సంబంధిత భూ యజమానికి వివరాలను తెలియజేసి, నిబంధనల ప్రకారం వారి సమ్మతిని నమోదు చేయాలని అన్నారు. ప్రతి భూ రీ-సర్వే సమయంలో సంబంధిత రైతుల వద్ద ఉన్న పట్టాదారు పాస్‌బుక్‌లు, పాత పహాణీలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, సాగుకు సంబంధించిన ఇతర ఆధారాలను పరిశీలించి అవసరమైన వివరాలను సేకరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సర్వే నోటీసు అందించినట్లు రసీదు తీసుకోవడం, ఫోటోలతో కూడిన పంచనామా రూపొందించడం, ఆధార్, మొబైల్ నంబర్ వంటి వివరాలను నమోదు చేయడం వంటి ప్రక్రియలను తప్పనిసరిగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భూముల వాస్తవ విస్తీర్ణం, హద్దులు, సర్వే నంబర్లు, పట్టాదారు వివరాలను పాత రికార్డులతో సరిపోల్చి ఖచ్చితంగా నమోదు చేయాలని అన్నారు. ఏ ఒక్క అర్హుడి భూమి వివరాలు కూడా రీ-సర్వేలో తప్పిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. రికార్డుల్లో ఉన్న వివరాలకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితులకు మధ్య ఉన్న విస్తీర్ణ తేడాలను సాంకేతికంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. మ్యాప్‌లు, సర్వే నంబర్లు, క్షేత్రస్థాయి కొలతలను సమన్వయం చేసి భవిష్యత్‌లో భూ వివాదాలకు అవకాశం లేకుండా పక్కా రికార్డులను రూపొందించాలని అన్నారు. ఆధునిక రోవర్, ట్యాబ్ తదితర సర్వే పరికరాలను సమర్థవంతంగా వినియోగించి ప్రతి భూమిని క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా పరిశీలించాలని తెలిపారు. అర్హులైన భూ యజమానులు, సాగుదారులకు భూ హక్కులపై స్పష్టత కల్పించే విధంగా రీ-సర్వే ప్రక్రియను పూర్తి చేసి, అర్హులకు పట్టాదారు పాస్‌బుక్‌లు అందేలా రికార్డులను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. రీ-సర్వే సమయంలో రైతులు తమ భూముల వద్ద అందుబాటులో ఉండి సంబంధిత పత్రాలను అధికారులకు అందజేస్తూ పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ వినేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్, అధికారులు, రైతులు, భూ యజమానులు తదితరులున్నారు.

# కూల్చివేతలే కాంగ్రెస్ ప్రభుత్వ ఎజెండా : పువ్వాడ

## శ్రీనివాస్‌నగర్ బాధితులకు మాజీ మంత్రి పువ్వాడ మద్దతు



**ఖమ్మం, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** కాంగ్రెస్ ప్రభుత్వానికి విధ్వంసం, కూల్చివేతలు తప్ప మరో ఎజెండా కనిపించడం లేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. ఖమ్మం నగరంలోని శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో ఇళ్ల కూల్చివేతకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులకు ఆయన మద్దతు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల కోసం కొత్తగా నిర్మించిన ఇళ్ల కంటే, వివిధ కారణాలతో కూల్చివేసిన ఇళ్లే ఎక్కువగా ఉన్నాయని పువ్వాడ ఆందోళన వ్యక్తం చేశారు. వికాసం, అభివృద్ధి చేపట్టడం చేత కాని ప్రభుత్వం విధ్వంసానికి పాల్పడుతోందని మండిపడ్డారు. పేదల ఇళ్లను కూల్చివేసి వారి జీవనోపాధిపై ప్రభావం చూపడం సరికాదని, పేదల పొట్ట కొట్టే చర్యలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇళ్ల కూల్చివేత ఆలోచనను వెంటనే విరమించుకోవాలని కోరారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో నగరంలో అనేక మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందించడం తో పాటు, పేదలకు గృహ వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గుర్తు చేశారు. పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడం తమ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధికి నిదర్శనమైతే, ఇప్పుడు పేదల ఇళ్లు కూల్చివేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మిగిలిన ఘనతగా మారిందని ఆయన విమర్శించారు.

# యూపిఐపై చార్జీల దోపిడీ- పేదోడి జేబు కొట్టే కుట్ర

## జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్ ఫైర్



**ఖమ్మం, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** సామాన్యుడు డిజిటల్ పేమెంట్ చేస్తే కూడా చార్జీల పేరుతో దోచుకోవాలని చూస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరు దారుణమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ధ్వజమెత్తారు. కొత్తగా యూపిఐ పేమెంట్లపై చార్జీలు వసూలు చేయాలని కేంద్రం యోచిస్తుండటంపై ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "నోట్ల రద్దుతో మొదలు పెట్టి డిజిటల్ ఇండియా అని గొప్పలు చెప్పి, ఇప్పుడు అదే డిజిటల్ లావాదేవీలపై చార్జీల పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల రక్తం తాగాలని చూస్తోంది బీజేపీ. టీ కొట్టు, కూరగాయల బండి దగ్గర కూడా 10 రూపాయలు యూపిఐ చేస్తే చార్జీ కట్టాలా? ఇది దోపిడీ కాదా? అదే విధంగా నాడు నల్లధనం తీసుకొచ్చి పేద ప్రజల అకౌంట్‌లో వేస్తామని మోసంచేసింది నిజం కాదా? కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు మాఫీ చేసే మోదీ ప్రభుత్వం, సామాన్యుడి చెమట డబ్బుపై కన్నేసింది. బ్యాంకుల్లో మినిమం బ్యాలెన్స్ లేదని దోపిడీ, ఇప్పుడు యూపిఐ చేస్తే దోపిడీ. ఇది ప్రజా ప్రభుత్వమా? దోపిడీ ప్రభుత్వమా?.. తక్షణమే యూపిఐ చార్జీల ప్రతిపాదనను వెనక్కి తీసుకోకపోతే, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం. బీజేపీ దోపిడీ విధానాలను ప్రజల్లో ఎండగడతాం" అని హెచ్చరించారు.



# ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, రాజకీయ ప్రతినిధులతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ముందుగా ఈవిఎం గోడౌన్ సీల్ ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి, ఈ.వి.ఎం., వి.వి.ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. అలారం, ఫైర్ సేఫ్టీ పరికరాలు పరిశీలించారు. సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. ఎన్నికల సామాగ్రి భద్రత అత్యంత ముఖ్యమని, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఎ. రాజు, ఆర్ అండ్ బి డిఇ లఖన్ నాయక్, ఎన్నికల డిటి అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పసుమర్తి శ్రీనివాస్, బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బి. వేణుగోపాల్, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, సిపిఐ (ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్, అధికారులు, తదితరులున్నారు.

# పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

## రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికపై మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో సమీక్ష చేసిన కలెక్టర్

**ఖమ్మం, సెప్టెంబర్ 16 (పీపుల్స్ డైరీ) :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మునిసి పల్ కమీషనర్లు, తహసీల్దార్‌లు, హౌజింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారుల ఎంపిక పై అధికారులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అర్హులైన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి చేకూర్చాలన్నారు. లబ్ధిదారుల క్షేత్రస్థాయి పరిశీలన తప్పనిసరి అని అన్నారు. ఇందిరమ్మ కమిటీల నుంచి వచ్చిన లబ్ధిదారుల పేర్లను అధికారులు స్వయంగా క్షేత్రస్థా యికి వెళ్లి పరిశీలించి, అర్హతలను ధృవీకరించిన తర్వాతే ఆన్‌లైన్ మోడ్‌లో అప్రూవల్స్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అర్హత కలిగి, స్వంత స్థలం ఉన్నవారికి నేరుగా గెజిటెడ్ అధికారులు పరిశీలించి, ఎంపీడీఓ ద్వారా కలెక్టర్ లాగిన్‌కు పంపిన వెంటనే మంజూరు ఇవ్వబడుతుందన్నారు. అర్హత ఉండి, ఇల్లు నిర్మించుకోవడానికి స్థలం లేనివారు, గతంలో ఇల్లు మంజూరైన వారు, ఫోర్ వీలర్ ఉన్నవారు, ఆదాయ పన్ను చెల్లింపుదారులు లేదా సాంకేతిక లోపాల వల్ల ఇనెలిజిబుల్ జాబితాలోకి వెళ్లినవారు తదితర విచారణల్లో పొరపాట్లు జరగొద్దన్నారు. గతంలో తప్పుడు సమాచారం లేదా సర్వే లోపాల వల్ల అర్హులైన పేదలు ఎల్ 3 జాబితాలోకి వెళ్లడం జరిగిందని, ఈసారి అటువంటి తప్పిదాలు పునరావృతమైతే సంబం ధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడ ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమని, ఏ దశలోనూ నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డా. పి.శ్రీజ, పై.శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమీషనర్లు, తహశీల్దార్లు, హౌజింగ్ అధికారులు, తదితరులున్నారు.





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN**, PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com